హైదరాబాద్ వార్త

నగర పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం కీలకం

అధికారులతో సమావేశమైన మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

హైదరాబాద్, మే 14 ప్రభాతవార్త: నగర పరిశుభ్రతను మెరుగుపరచడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. గురు వారం తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాల యంలో ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు అమలుపై డిఈఈ లు, ఏఈ లకు అవగా హన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరిశుభ్రత, వ్యర్థాల వర్గీకరణ, దోమల పెరుగుదల నియంత్రణ తదితర అంశాలపై పారిశుధ్య అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద చెత్తను నాలుగు విభాగాలుగా వేరు చేసి అందించాలని సూచించారు. తడి చెత్తగా ఆహార అవశేషాలు, కూరగాయలు, పండ్ల వ్యర్థాలు, పొడి చెత్తగా కాగితం, ప్లాస్టిక్, గాజు, లోహాలు, ప్రత్యేక వ్యర్థాలుగా డైపర్లు, శానిటరీ నాప్కిన్లు శానిటరీ, ప్రమాదకర వ్యర్థాలు గా బ్యాటరీలు, మందుల సీసాలు, కెమికల్స్ వంటి వేరుచేయాలన్నారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన నగర నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ నాలు గు రకాల వ్యర్థాలను వేర్వేరుగా ఇవ్వడం ద్వారా రీసైక్లింగ్ సులభమవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని కమిషనర్ తెలిపారు. అలాగే దోమల పెరుగుదల ప్రాంతాలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం నిల్వ నీరు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఫీల్డ్ స్థాయిలో అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు.

మెట్రో రెండో దశలో ముందడుగు

➤ఇప్పటికే మొదటి దశ స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం

➤రెండో దశకు కేంద్రంపై ఒత్తిడి పెంచిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, మే 14 ప్రభాతవార్త:

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మెట్రోరైల్ రెండో దశకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. మెట్రోరైల్ మొదటి దశను స్వాధీనం చేసుకోవడంతో పాటు రెండో దశ పనులను కూడా ప్రారంభించడం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే ప్రభుత్వం హైదరాబాద్ మెట్రోరైల్ మొదటి దశ ప్రాజెక్ట్‌లో వందశాతం ఈక్విటీ వాటాను తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. దీంతో రెండోదశ ప్రారంభానికి మార్గమం సుగమమైంది. ఇందుకు సంబంధించిన డీపీఆర్‌లను కేంద్రానికి పంపించి కూడా దాదాపు ఒకటిన్నర సంవత్సరాలు గడుస్తోంది. గతంలోనే కేంద్రానికి డీపీఆర్‌లు పంపినప్పటికి కేంద్రం మెలికలు పెడుతూ వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మొదటి దశను అలాగే కొనసాగిస్తూ రెండవ దశను మాత్రం నిర్వహించాలనుకున్నట్లు తెలుస్తోంది. మెట్రోరైల్ రెండవ దశ అనుమతి పొందాలంటే మెట్రోరైల్ ఆపరేషన్ పరంగా సమన్వయం కోసం మొదటిదశ ప్రాజెక్టును నిర్వహిస్తున్న ఎల్అండ్‌టీతో కచ్చితమైన ఒప్పందం చేసుకోవాలని కేంద్రం మెలిక పెట్టింది. కాగా ఎల్అండ్‌టీ కచ్చితమైన ఒప్పందం చేసుకోడానికి అంగీకరించలేదు. అంతే కాకుండా అవసరమైతే మొదటి దశ మెట్రో ప్రాజెక్టు ప్రభుత్వానికి స్వాధీనం చేసేందుకు సిద్ధమని ప్రకటించింది. ఎట్లాగు మెట్రోరైల్ రెండవ దశకు కేంద్రం అనుమతించడం లేదని భావించి ప్రభుత్వం మొదటి దశను స్వాధీనం చేసుకోడానికి సిద్దపడింది. మెట్రోరైల్ మొదటి దశను స్వాధీనం చేసుకోవడంతో పాటు రెండో దశ పనులను కూడా ప్రారంభించడం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇప్పుడు ఎల్అండ్‌టీ నుంచి మెట్రోరైల్ సర్కారు చేతికి రావడంతో కేంద్రం అభ్యంతరాలు తొలగిపోయినట్టైంది. మెట్రోరైల్ స్వాధీనం చేసుకున్న విషయాన్ని నివేదించి రెండవ దశ మెట్రోరైల్‌కు సత్వరం అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచుతోంది. ఇప్పటికే స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల దృష్టికి స్వయంగా తీసుకెళ్లడంతో రెండవ దశకు వేగంగా కదలిక జరుగుతోంది.

రెండో దశకు ప్రతిపాదనలు....

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంతో రూ. 24వేల 269 కోట్లతో ఐదు కారిడార్లలో 76.4 కిలోమీటర్ల మేరకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా కింది రూ. 7వేల 313కోట్లు, కేంద్రం వాటాకింద రూ. 4వేల 230 కోట్లు, అలాగే పీపీపీ ద్వారా రూ. 1వేయ్యి 33 కోట్లుగా అంచనా వేశారు. ఈ ప్రతిపాదనలో మియాపూర్ నుంచి పటాన్‌చెరు 13.4 కిలో మీటర్లు, ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ 7.1కిలో మీటర్లు, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట 7.5కిలోమీటర్లు, నాగోల్ నుంచి శంషాబాద్ 36.8కిలో మీటర్‌లు, రాయదుర్గం నుంచి కోకాపేట 11.6కిలో మీటర్‌లు రెండో దశ (ఏ)లో భాగంగా పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. అలాగే రెండో దశ (బి)లో భాగంగా మూడు కారిడార్లలలో 86.1 కిలో మీటర్‌లకు ప్రతిపాదించారు. ఇందుకోసం రూ. 19వేల 579 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇందులో కేంద్రం వాటాకింద రూ. 3వేల 524కోట్లు, రాష్ట్రం వాటాకింద రూ. 5వేల874 కోట్లుగా రుణ సేకరణ కోసం రూ. 9వేల 398కోట్లుగా అంచనా వేశారు. అలాగే పీపీపీ ద్వారా రూ. 783కోట్లుగా ప్రతిపాదనలో పేర్కొన్నారు. ఇందులో జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ 22 కిలోమీటర్‌లు, శంషాబాద్ విమానాశ్రయం (ఫ్యూచర్ సిటీ) వరకు 39.6కిలో మీటర్‌లు, జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు 24.5కిలో మీటర్‌ల వరకు మెట్రోరైల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కచ్చితత్వంతోనే ఉందని తెలుస్తోంది.

సాయిబాబా నగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని

సంజీవరెడ్డి నగర్, మే 14, ప్రభాతవార్త: సంజీవరెడ్డి నగర్ పరిధిలోని సాయిబాబా నగర్‌లో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం, రూ.3.60 లక్షలతో చేపట్టనున్న సీవరేజ్ లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ ప్రాంత సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీసీ రోడ్డు నిర్మాణం, సీవరేజ్ పైప్‌లైన్ ఏర్పాటు ద్వారా సాయిబాబా నగర్ ప్రజల ప్రధాన సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన తెలిపారు. 2014 తర్వాతే సనత్‌నగర్ నియోజకవర్గంలో అభివృద్ధి వేగంగా జరిగిందని పేర్కొన్న తలసాని, రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీటి సమస్యలపై ప్రజల నుంచి అధిక ఫిర్యాదులు వచ్చేవని, వాటిని దశలవారీగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. గతంలో 60 ఫీట్ రోడ్డు అత్యంత దయనీయ స్థితిలో ఉండేదని, తన హయాంలోనే సీవరేజ్ లైన్ అభివృద్ధి చేసి విశాలమైన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి కార్యక్ర మాలు కొనసాగిస్తున్నామని ఎమ్మె ల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించక ముందే రంగంలోకి మహిళా కమిషన్ చైర్‌పర్సన్

బేగంపేట మే 14, ప్రభాతవార్త : తెలంగాణా రాష్ట్ర మహిళా కమీ షన్ చైర్ పర్సన్‌గా నియమితురాలైన గద్వాల విజయలక్ష్మి మరో సారి బాధ్యతలు చేపట్టకముందే స్పందించి తనదైన శైలిని ప్రదర్శించారు. అధికారికంగా బాధ్యతలు స్వీకరించడానికి ముందే మహిళల సమస్యల పరిష్కారంపై ఆమె ప్రత్యేక దృష్టి సారించారు. లైంగిక వేధింపులకు గురి అయిన ఒక విద్యార్థిని అనారోగ్య కారణాలతో ఇంజనీరింగ్ థర్డ్ ఇయర్ లో కళాశాలకు గైర్హాజరైంది. దీంతో కళాశాల వారు తగిన (పర్సంటేజీ) హాజరు లేదంటూ బాలికను పరిక్షలు రాయడానికి అనుమతి నిరాకరించారు. ఈ విషయం తెల్సుకున్న గద్వాల విజయలక్ష్మి వెంటనే స్పందించి జేఎన్‌టీయూ అధికారులతో మాట్లాడి బాలికకు జరిగిన వేధింపులు, ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మానవతా దృక్పథంతో పరిక్షలు రాసేందుకు బాలికకు అవకాశం కల్పించాలంటూ కోరారు. దీంతో స్పందించిన జేఎన్‌టీయూ అధికారులు బాలికకు తగిన న్యాయం జరిగేలా చూస్తామంటూ హామీ ఇచ్చారు. కరీంనగర్ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఉక్కపోతతో గర్భిణులు బాలింతలు ఇబ్బంది లకు గురవుతున్నట్లు పత్రికల్లో వచ్చిన కథనంపై కూడా గద్వాల విజయలక్ష్మి స్పందించారు. ఈ విషయాన్ని అక్కడి జిల్లా అధికా రులతో మాట్లాడి. సమస్యను పరిష్కరించారు. మహిళలకు తగిన సౌకర్యాలు కల్పించాలని, నాణ్యమైన వైద్యం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా మహిళలను చూసుకోవాలంటూ సూచించారు.

క్రికెట్ బెట్టింగ్ అప్పులతో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఆర్మీ జవాన్ అరెస్ట్

నేరేడ్‌మేట్ మే 14, ప్రభాతవార్త : క్రికెట్ బెట్టింగ్ వ్యసనంతో అప్పుల పాలై మహిళల బంగారు గొలుసులను టార్గెట్‌గా చేసుకున్న ఓ ఆర్మీ జవాన్‌ను నేరేడ్మెట్ పోలీసులు అరెస్ట్ చేశారు. చైన్ స్నాచింగ్ కేసును ఛేదించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు మల్కాజిగిరి డివిజన్ ఏసీపీ వి. యాదగిరి రెడ్డి తెలిపారు. నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా చెందిన కుర్రపోతుల రెడ్డిశేఖర్ (31) ప్రస్తుతం ఆల్వాల్ త్రిశూల్ లైన్ ఆర్మీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ ఆర్మీలో జనరల్ డ్యూటీ జవాన్‌గా పనిచేస్తున్నాడు. క్రికెట్ బెట్టింగ్‌కు బానిసైన అతడు తీవ్ర అప్పుల్లో కూరుకుపోయి డబ్బుల కోసం మహిళల గొలుసులు లాక్కోవాలని యోచించాడు. ఈ నెల 10న సాయంత్రం తన నల్లరంగు బజాజ్ పల్సర్ బైక్‌పై బయలుదేరిన నిందితుడు, ముందుగా డాల్ఫిన్ వైన్ షాప్ సమీపంలోని ఓ పాన్ షాప్ వద్ద ఆగి, సీసీ కెమెరాలకు చిక్కకుండా ఉండేందుకు బైక్ నంబర్ ప్లేట్‌ను నకిలీ స్టిక్కర్‌తో మార్చుకున్నాడు. అనంతరం సప్తగిరి కాలనీలో నివాసముంటున్న జొన్నగడ్డ యోగేందర్ మణి మేఖల (57)ను అడ్రస్ అడిగినట్లు నమ్మబలికి, ఆమె మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు నల్లపూసల గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఘటనపై కేసు నమోదు చేసిన నేరేడ్మెట్ పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో దర్యాప్తు చేపట్టి, విశ్వసనీయ సమాచారంతో ఈ నెల 13న రాత్రి డాల్ఫిన్ వైన్ షాప్ సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ వి. యాదగిరి రెడ్డి మాట్లాడుతూ..నేరాలకు పాల్పడే వారెవరైనా తప్పించుకోలేరు. సీసీటీవీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో పోలీసులు వేగంగా కేసులను ఛేదిస్తున్నారు. మహిళలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని" సూచించారు. ఈ కేసు ఛేదనలో డీసీపీ శ్రీధర్ ఐపీఎస్ పర్యవేక్షణలో, ఇన్‌స్పెక్టర్ పి. సందీప్ కుమార్, ఎస్ఐ జి. చంద్రశేఖర్, నేరేడ్మెట్ పోలీస్ సిబ్బంది కీలక పాత్ర పోషించారని తెలిపారు . కీలక పాత్ర పోషించిన పోలీసులకు ఏసీపి యాదగిరి రెడ్డి రివార్డ్స్ అందించారు.

చేప ప్రసాదం పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

-ప్రజలకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలి

-అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వాకిటీ శ్రీహరి, అజారుద్దీన్, కలెక్టర్ ప్రియాంక అల తదితరులు

హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త: మృగశిర కార్తె సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో చేప ప్రసాదం పకడ్బందీగా జరగాలని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులు వాకిటి శ్రీహరి, మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్, జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా, బత్తిని కుటుంబ సభ్యులతో కలిసి సమీక్షించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 179 సంవత్సరాలుగా ప్రజల విశ్వాసం, నమ్మకంగా కొనసాగుతున్న చేప ప్రసాదం కార్యక్రమం హైదరాబాద్ నగర ప్రత్యేకతగా నిలిచిందన్నారు. తెలంగాణతో పాటు దేశంలోని పలు రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా వేలాది మంది భక్తులు, ఆస్తమా బాధితులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని, ఈసారి సుమారు లక్షలాది మంది ప్రసాదం స్వీకరించే అవకాశం ఉందన్నారు. గత అనుభవాలను సమీక్షించిలో పాలను సరిదిద్దుకుంటూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భారీ జన సామర్థం దృష్ట్యా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ నిర్వహణ, క్రౌడ్ కంట్రోల్ చర్యలు చేపట్టాలని సూచించారు. పిక్‌పాకెటింగ్, చోరీలు, చైన్ స్నాచింగ్, ఈవ్ టీజింగ్ వంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమ ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాల్లో రాత్రంతా పూర్తి స్థాయి లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, అవసరమైన మందులు, సీపీఆర్ శిక్షణ పొందిన వైద్య సిబ్బంది మరియు వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పోలీస్, ఆర్ అండ్ బీ, జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డ్, విద్యుత్, రెవెన్యూ, ఆర్టీసీ, రవాణా, ఫిషరీస్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య మరియు సమాచార శాఖ సమన్వయంతో పనిచేస్తూ బ్యారికేడింగ్, క్యూ లైన్లు, వాటర్‌ప్రూఫ్ షెడ్లు, టెంట్లు, పారిశుధ్యం, మొబైల్ టాయిలెట్లు, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, అవగాహన ప్రచారం, అదనపు బస్సు సర్వీసులు, అగ్నిమాపక భద్రత తదితర ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని సూచించారు.

ఈసమావేశంలో టీజీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్, హైదరాబాద్ రీజినల్ మేనేజర్ సుధా పరిమళ, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్, ప్రాంతీయ సమాచార అధికారి రాములు, ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మనోహర్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీధర్, హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ, అగర్వాల్ సమాజ్, జైస్వాల్ సమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

లేడీస్ హాస్టల్ టెర్రస్‌పై మహిళ అనుమానాస్పద మృతి

జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ మే 14, ప్రభాతవార్త: ఓ లేడీస్ హాస్టల్ టెర్రస్ పైన ఉన్న బాత్ రూమ్ లో ఒక మహిళ అనుమానస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్ర ప్రదేశ్ లోని , కృష్ణ జిల్లా విజయవాడ అర్బన్ ప్రాంతానికి చెందిన ఇదుపల్లి హరిత (36) పదేళ్ల క్రితం హైదరాబాద్ వచ్చింది. మెహింది పెట్టడం తదితర పనులు చేసుకుంటూ, మధురానగర్ లోనీ భార్గవి లేడీస్ హాస్టల్ టెర్రస్లో నివసిస్తుంది. ఆమె థైరాయిడ్ సమస్యతోపాటు ఊబకాయం సమస్యతో బాధపడుతున్నట్లు ఆమె తల్లి తెలిపారు. మూడు రోజుల కిందట ఆమెకు అనారోగ్యంగా ఉందని తల్లి పోలీసులకు తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం భార్గవి లేడీస్ హాస్టల్ ఓపెన్ టెర్రస్పై ఉన్న బాత్రూంలో దుర్వాసన వస్తుందని వెళ్లి చూడగా బాత్ రూమ్ లో హరిత విగత జీవిగా పడి ఉంది. వెంటనే అప్రమత్తమై మధురానగర్ పోలీసులకు సమాచారమివ్వగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. మృతురాలి తల వెనుక భాగంలో గాయం కావడంతో పాటు అనారోగ్యం కారణంగా ఆమె మరణించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ సంఘటన రెండు మూడు రోజుల క్రితం జరిగి ఉంటుందని పోలీసులు మనిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నకిలీ నంబర్ ప్లేట్‌తో తిరుగుతున్న యువకుడు అరెస్ట్

నకిలీ నంబర్ ప్లేటు

సంజీవరెడ్డి నగర్, మే 14, ప్రభాతవార్త: హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో నకిలీ నంబర్ ప్లేట్ ఉపయోగిస్తున్న వ్యక్తిని గుర్తించి సనత్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. కూకట్‌పల్లికి చెందిన జి. సాయి గణేష్ అనే యువకుడు తన వాహనానికి నకిలీ నంబర్ ప్లేట్ ఉపయోగిస్తూ ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నిందితుడు తన అసలు వాహన నంబర్ ఏపీ 21ఏవి 6721కు బదులుగా ఏపీ 21బీసీ 2008 అనే మరో వాహనానికి చెందిన నంబర్ ప్లేట్‌ను అక్రమంగా వాడుతున్నట్లు ట్రాఫిక్ తనిఖీల్లో బయటపడింది. ఈ నంబర్ హోండా యూనికార్న్ వాహనానికి చెందినదిగా గుర్తించారు. నిందితుడు చేసిన ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన చలాన్లు అసలు వాహన యజమాని పి.ఎస్. మొహమ్మద్ జాఫర్ పేరిట నమోదవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 318(2), మోటార్ వాహనాల చట్టం సెక్షన్ 80(ఏ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, సనత్‌నగర్ పోలీసులు సంయుక్తంగా విచారణ జరిపి నిందితుడిని అదుపులోకి తీసుకు న్నారు. అనంతరం బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసు జారీ చేసినట్లు తెలిపారు .ఈ సందర్భంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు. నకిలీ, తారుమారు చేసిన లేదా ఇతరుల నంబర్ ప్లేట్లను వాడటం తీవ్రమైన నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అత్యాధునిక సీసీటీవీ నిఘా వ్యవస్థలు, ఏఎన్‌పీఆర్ కెమెరాల ద్వారా నకిలీ నంబర్ ప్లేట్లను సులభంగా గుర్తిస్తున్నామని తెలిపారు. వాహన యజమానులు తమ నంబర్ ప్లేట్ దుర్వినియోగం అవుతుందనే అనుమానం ఉంటే వెంటనే ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

కళలు జ్ఞానం వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయి

-హర్యానా పూర్వ గవర్నరు బండారు దత్తాత్రేయ

కళాకారులతో బండారు దత్తాత్రేయ, సంధ్యారాణి, లక్ష్మీనారాయణ, జయంతిరెడ్డి, రఘుశ్రీ తదితర అతిథులు

రవీంద్రభారతి, మే 14 ప్రభాతవార్త : ప్రపంచంలో భారతదేశం కళలకు ఎంతో ప్రసిద్ధిఅని, విదేశీయులూ గౌరవిస్తారని, కళల ద్వారా జ్ఞానం, వ్యక్తిత్వం వికసిస్తాయని హర్యానా రాష్ట్ర పూర్వ గవర్నరు బండారు దత్తాత్రేయ అన్నారు. ముఖ్యంగా చెడువ్యసనాలకు బానిసలవుతున్న నేటి యువత కళల వైపు దృష్టిసారిస్తే ఎందరో గొప్ప కళాకారులు పుట్టుకొస్తారని తెలిపారు. వేసవి సెలవులలో సైతం పిల్లలను సాంస్కృతిక కళలలో ప్రదర్శనలిచ్చేలా ప్రోత్సహిస్తూ మన సంస్కృతి కళలను ముందుతరాలకు తెలియజేసేలా శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు పాలపర్తి సంధ్యారాణి చేస్తున్న కృషిని దత్తాత్రేయ హర్షించారు. ఇలా ప్రతీఒక్కరూ దేశం కోసం మంచి సమాజ నిర్మాణం కోసం కృషిచేయాలని సూచించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోడై పిల్లలకు కళలపై అభిరుచి కల్పిస్తే కళలల్లో గొప్పగా రాణిస్తారని, మన కళలను వెల్లివిరుస్తాయని తద్వారా సమాజం సన్మార్గంలో పయనిస్తుందని వక్తలు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ వేసవి వినోదాలు పేరిట రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో లంక లక్ష్మీనారాయణ సభాధ్యక్షతన ఘనంగా నిర్వహించిన కార్యక్రమానికి బండారు దత్తాత్రేయ ముఖ్యఅతిథిగా పాల్గొని గౌరవ అతిథులు జయంతిరెడ్డి, సూరిబాబు, విక్రమ్, రఘుశ్రీ, పి.సంధ్యారాణి తదితరులతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న కళాకారులను ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు. ఈనాటి వేసవి వినోదాల్లో కూచిపూడి నృత్యం, వర్ధమాన గాయకుల ఆట పాటలు, హాస్యవల్లరి తదితర ప్రదర్శనలు ఆహుతులను ఉల్లాసపరిచాయి.

ప్రజలకు ఆహ్లాదం పంచే విధంగా పార్కుల అభివృద్ధి

-లీజుదారులు అద్దెబకాయిలు వెంటనే చెల్లించాలి

-యువ క్రీడాకారులకు అన్ని వసతులు ఏర్పాటు

-ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

అధికారులను అడిగి వివరాలు తెలుసుకుంట్ను మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

హైదరాబాద్, మే 14 ప్రభాతవార్త: ప్రజలకు ఆహ్లాదపరిచే విధంగా పార్కులు అభివృద్ధి చేయనున్నట్లు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. 99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం ఈస్ట్ మారేడ్ పల్లి, నాచారం ఐడీఏ, టీచర్స్ కాలనీ, హిస్సామ్‌గంజ్ మోండా మార్కెట్, వెంకటరమణ కాలనీ, అరుణోదయ నగర్ ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఈస్ట్ మారేడ్‌పల్లిలోని టీచర్స్ కాలనీలోని ఎంఎంసి పార్కును పరిశీలించారు. పార్క్‌లో నిరంతర శుభ్రత, మెరుగైన నిర్వహణ, అలాగే ప్రజల భద్రత. సౌకర్యం కోసం సరైన లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రదేశాలను మరింత శుభ్రంగా, సురక్షితంగా, అందరికీ అందుబాటులో ఉండేలా చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నాచారంలోని ఐడీఏలోని రహేజా విస్టాస్ ఎలైట్ లో కొనసాగుతున్న జనగణన కార్యక్రమాన్ని పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో జనగణన ఎలా జరుగుతోందో తెలుసుకునేందుకు ఎన్యూమరేషన్ ప్రక్రియ వీక్షించారు. డీసీ, డీఈ, ఎన్యూమరేటర్లతో మాట్లాడి, ఎన్యూమరేషన్ విధానం, పనితీరు, కార్యనిర్వహణ సామర్థ్యంపై వివరాలు తెలుసుకుని జనగణన కార్యక్రమం సమర్ధవంతంగా సాగేందుకు సూచనలు ఇచ్చారు. అలాగే కమిషనర్ ఈస్ట్ నెహ్రూ నగర్, టీచర్స్ కాలనీలోని మున్సిపల్ ప్లేగ్రౌండ్‌ను పరిశీలించారు. గ్రౌండ్ పరిస్థితులు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, యువ క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణ నాణ్యతను సమీక్షించారు. ఈ సందర్భంగా కోచ్‌లతో మాట్లాడిన కమిషనర్‌కు అదనపు క్రీడా సామగ్రి, మెరుగైన నిర్వహణ అవసరమని వారు వివరించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా శిక్షణకు అనుకూలంగా సరైన లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మైదానంలో శిక్షణ పొందిన క్రీడాకారులు అండర్18 బాస్కెట్‌బాల్ విభాగంలో జాతీయ స్థాయికి చేరుకోవడం గర్వకారణమని కమిషనర్ అభినందించారు. వీటితో పాటు హిస్సామ్‌గంజ్ మోండా మార్కెట్‌ను సందర్శించి అద్దె బకాయిలు, అద్దె పెంపు స్థితి, దుకాణాల ఆక్యుపెన్సీపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని లీజుదారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా, షాపులుగా మారిన థాయ్ బజార్ ప్లాట్‌ఫారమ్‌లన్నింటికీ ఎన్యూమరేషన్ నిర్వహించి సరైన డాక్యుమెంటేషన్, ఆదాయ ట్రాకింగ్ చేపట్టాలని సూచించారు. అంతే కాకుండా నాగోల్‌లోని వెంకటరమణ కాలనీ, అరుణోదయ నగర్, సరూర్‌నగర్ నేతాజీ నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా భవన అనుమతి పత్రాలను పరిశీలించి, జరుగుతున్న నిర్మాణ పనులు ఆమోదిత ప్రణాళిక, నిబంధనల ప్రకారం జరుగుతున్నాయా లేదా అన్నది సమీక్షించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏవైనా మార్పులు ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే అండర్‌గ్రౌండ్ పార్కింగ్ స్థలం, బేస్‌మెంట్ పార్కింగ్‌లోని నీటి డ్రైనేజ్ వ్యవస్థను పరిశీలించి భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో తనిఖీ చేశారు.

కొత్త నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసే సమయంలో అన్నిని యమాలు, మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని, పట్టణ ప్రణాళిక నిబంధనలకు పూర్తి అనుసరణ ఉండాలని కమిషనర్ స్పష్టం చేశారు.

బడిబాటలో విద్యార్థుల సంఖ్యను పెంచండి

- డిప్యూటీ ఐఓఎస్ వెంకటరెడ్డి

తల్లిదండ్రుల సమావేశంలో డిప్యూటీ ఐ.ఓ.ఎస్ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు

చాంద్రాయణగుట్ట, మే 14, ప్రభాతవార్త : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం గురువారం ప్రభుత్వ పాఠశాలలో మొదలైయ్యింది. జూన్ 19 వరకు జరిగే కార్యక్రమంలో పాఠశాల వయస్సు గల చిన్నారులను వంద శాతం గుర్తించి సమీప ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి. అదేవిధంగా జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యావారోత్స వాలు ప్రారంభమైయ్యాయి. గురువారం ఆయా పాఠశాలల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. దారుల్‌షిఫాలోని బజార్ ఏ నూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బహదూర్‌పురా మండలం 1, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ పెద్దిరెడ్డి వెంకటరెడ్డి హాజరై మాట్లాడుతూ బడిబాటలో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమైతయాన్నారు. సుశిక్షతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పిస్తే గల లాభాలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మందడి వెంకటరెడ్డి, ఫహమీదా ఖాతూన్, ఉపాధ్యాయురాలు ముహమ్మది తయ్యబ, పాల్గొన్నారు.

విహెచ్‌ను అభినందించిన కాంగ్రెస్ నేతలు

ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన విహెచ్‌ను అభినందిస్తున్న డాక్టర్ రోహిన్‌రెడ్డి, ఎ.జ్యోతి, లక్పతి యాదగిరిగౌడ్ దంపతులు, శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, మే 14 ప్రభాతవార్త

మాజీ రాజ్యసభ సభ్యుడు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు కాంగ్రెస్ పార్టీ సైనికుడు అని పిసిసి మాజీ కార్యదర్శి లక్పతి యాదగిరిగౌడ్, ఎ.జ్యోతి గౌడ్ కొనియాడారు. ఎమ్మెల్యేగా,పిసిసి అధ్యక్షుడిగా, రాజ్యసభ సభ్యుడిగా 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు పనిచేస్తున్నారని తెలిపారు. ఇటీవల ప్రభుత్వ సలహాదారులుగా ఎన్నికైన హనుమంతరావును జ్యోతి లక్పతి యాదగిరి గౌడ్ దంపతులు గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్ లో పదవి బాధ్యత స్వీకరణ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం,రేవంత్ రెడ్డి సర్కారు,పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,సీఎం సలహాదారులు హర్కర వేణుగోపాల్ రావులు బీసీలను గుర్తించి సుమచితస్థానం కల్పిస్తున్నారని జ్యోతి యాదగిరి గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి,ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోత రోహిత్, పిసిసి కార్యదర్శులు శంభుల శ్రీకాంత్‌గౌడ్, నాగభూషణం,మాజీ ఉపాధ్యక్షుడు బొల్లు కిషన్, మాజీ కార్పొరేటర్ నారాయణస్వామి,ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి వై ఎస్. రామకృష్ణ



ప్రముఖ గాయకుడు వై ఎస్. రామకృష్ణ, నేమాని లలితాలను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, మే 13 (ప్రభాతవార్త) : గాయకుడిగానే కాకుండా ఉత్తమ గురువుగా ఎంతో మంది శిష్యులను తీర్చిదిద్దిన బహుముఖ ప్రజ్ఞాశాలి వై ఎస్. రామకృష్ణ అని ప్రముఖులు ప్రశంసించారు. గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లో సుప్రసిద్ధ గాయకులు , సంగీత గురువు వై.ఎస్. రామకృష్ణ..నేమాని లలితాలను ది గంటిస్ ఆధ్వర్యంలో నిర్వాహకులు గంటి రామకృష్ణ, గంటి శైలజ నేతృత్వంలో ఆత్మీయ సత్కారం కార్యక్రమం జరిగింది. వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు, కిన్నెర సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి మద్దాలి రఘురాం, తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధానకార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, విశ్రాంత డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.రాజగోపాల రావు , ప్రముఖ వ్యాపారవేత్త రవీంద్రకుమార్ అగర్వాల్, చింతలపూడి త్రినాథ్ రావు , చైతన్యభారతి సంగీత నాటక కళాపరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, దైవజ్ఞ శర్మ, ప్రముఖ వ్యాపారవేత్త రాఘవేందర్, కళాపోషకులు విశ్వనాథ్ మద్దిపట్ల, వడ్లకొండ వెంకట్ రావు, వంశీ మేనేజింగ్ ట్రస్టీ సుంకరపల్లి శైలజ, డాక్టర్ వి.రాజా, ప్రముఖ వ్యాపారవేత్త హేమంత్ కుమార్ పోసాని, ప్రముఖ గాయని నేమాని లలిత పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ రామకృష్ణ స్వరంలో ఉన్న మాధుర్యం, గాన కళలో ఆయనకు ఉన్న పట్టు అసాధారణమైనవని అతిథులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ రేయి తీయనిది.. మరపురానిది.. మధురమైనది. అనే శీర్షికతో తెలుగుహిందీ సంగీత విభావరిని నిర్వహించారు. శ్రీ కృష్ణ స్వర రాగ ప్రవంతి సభ్యులు, శిష్యులు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని గీతాలాపన చేశారు.

ఎన్యూమరేటర్లు జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

పాతబస్తీలో పర్యటిస్తున్న చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కె.సత్యనారాయణ

చార్మినార్,మే 14 ప్రభాతవార్త : జిహెచ్‌ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కె.సత్యనారాయణ గురువారం పలువురు అధికారులతో కలిసి చార్మినార్ సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న జనగణన ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే విధానాన్ని పరిశీలించి ఆరా తీశారు.ప్రతీ ఇంటికి వెళ్లి పూర్తి వివరాలను నమోదు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు జనగణన ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని తెలిపారు.ప్రజలు ఎన్యూమరేటర్లకు సహకరించి సరైన సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చార్మినార్ సర్కిల్ డిఎంసి సరిత,అధికారులు, సూపర్‌వైజర్లు,సిబ్బందితో పాటు పలువురు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థుల వికాసానికి కట్టుబడి పనిచేస్తుంది : ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ

బేగంపేట మే 14,ప్రభాతవార్త

ఆన్‌లైన్ ద్వారా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్న దృశ్యం.

బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల వికాసానికి కట్టుబడి పనిచేస్తుందని,ప్రిన్సి పాల్ ప్రొఫెసర్ అప్పియా చిన్నమ్మ అన్నారు .తెలంగాణా ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో (ఎడ్యుకేషన్ వీక్)లో భాగంగా బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అలుమ్ని కన్వీనర్ డా.డి.సరిత ఆధ్వర్యంలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రిన్సి పాల్ ప్రొఫెసర్ అప్పియా చిన్నమ్మ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సి పాల్ ప్రొఫెసర్ అప్పియా చిన్నమ్మ మాట్లాడుతూ అధ్యాపకుల సహకారం విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో ముఖ్యమని అన్నారు.బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లో నిష్ణాతులైన అధ్యాపక బృందం ఉందని,వారు అను నిత్యం విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలిపేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.విద్యార్థుల తల్లి దండ్రులు తమ కళాశాలపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు తనతో పాటు అధ్యాపక బృందం అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు.ఆన్‌లైన్ ద్వారా సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులు కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు,క్లబ్ కార్యాకలాపాలు,విద్యార్థుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను అభినందించారు.వరుసగా మూడు సంవత్సరాలు దేశంలోనే కళాశాల నెంబర్ 1 ప్రభుత్వ అటానమస్ కళాశాలగా గుర్తింపు పొందిన సందర్భంగా కళాశాల యాజమాన్యాన్ని,అధ్యాపకులను అభినందించారు.ఈ సందర్భంగా డా.డి.సరిత కార్యక్రమం విజయ వంతం కావడానికి సహకరించిన ప్రిన్సి పాల్ ,అధ్యాప కులు, విద్యార్థుల తల్లి దండ్రులకు ధన్యవాదాలు తెలియజేసారు.

రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి : అదనపు డిసిపి వేణుగోపాల్‌రెడ్డి

బేగంపేట మే 14,ప్రభాతవార్త

టాటా ఏఐజీలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి.

ప్రతి ఒక్క వాహన దారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని అప్పుడే రహదారి భద్రత సాధ్యమవుతుందని ట్రాఫిక్ 2 అదనపు డీసీపీ సి.వేణుగోపాల్‌రెడ్డి వాహన దారులకు సూచించారు.బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిసిట్యూట్ (టీటీఐ)ఆధ్వర్యంలో గురువారం అమీర్‌పేట లోని టాటా ఏఐజీ జనరల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఉద్యోగులకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బాధ్యతాయుతమైన డ్రైవింగ్ ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చన్నారు.ముఖ్యంగా డిఫెన్సివ్ డ్రైవింగ్ అలవర్చుకోవడం వల్ల ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చని ఆయన సూచించారు.ట్రాఫిక్ అడ్మిన్ ఏసీపీ జి.లక్ష్మణ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి గోల్డెన్ అవర్ లో సహాయం చేయడం ఎంతో కీలకమని వివరించారు.ఆ సమయంలో బాధితులను ఆదుకునే వారికి ప్రభుత్వం రాహ్ వీర్ (గుడ్ సమారిటన్)అవార్డు కింద రూ 25,000లు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందజేస్తుందని వెల్లడించారు.బేగంపేట టీటీఐ ఇన్స్‌పెక్టర్ నాగుల అశోక్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హెల్మెట్,సీటుబెల్టు ధరించడం,మద్యం సేవించి వాహనం నడపకపోవడం డ్రైవింగ్ సమయంలో మొబైల్ వాడకాన్ని నివారించడం వంటి అంశాలను ఉద్యోగులకు వివరించారు.సదస్సు ముగింపులో ఉద్యోగులు అంతా ప్లకార్డులు చేతబూని రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేసారు.ఈ కార్యక్రమంలో ఎస్సార్ నగర్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ కె.మహేష్,టాటా ఏఐజీ ప్రతినిధులు గోపాల రావు,సురేష్ బాబు,టీటీఐ సిబ్బంది కృష్ణ,సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకంలో జీవితం ఇమిడి ఉంటుంది : ప్రముఖ కవి నందిని సిధారెడ్డి

పురస్కార గ్రహీతలతో సిధారెడ్డి, శివారెడ్డి, చెన్నయ్య, రామమూర్తి తదితర అతిథులు

నాంపల్లి, మే 14 ప్రభాతవార్త : జీవితమనే పుస్తకంలో బతుకు ప్రస్ఫుటిస్తుందని, పుస్తకం చదివిన వారికి జీవితం తెలుస్తుంది... వ్రాసిన రచయితకు సమాజంలో గుర్తింపు వస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు ప్రముఖకవి డా. నందిని సిధారెడ్డి అన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. నందిని సిధారెడ్డి గౌరవ అతిథులు పరిషత్తు కార్యదర్శి డా. జె.చెన్నయ్య, కార్యక్రమ సమన్వయకర్త రింగు రామమూర్తి తదితరులతో కలిసి వివిధ ప్రక్రియల్లోని తెలంగాణ గ్రంథ రచయితలు డబ్బీకార్ శంకర్‌జీ, బిల్ల మహేందర్, కొట్టం రామకృష్ణారెడ్డి, ఆమ్‌గోత్ వెంకట్‌పవార్, డా. కొండపల్లి నీహారిణి, డా. దహగాం సాంబమూర్తి, సమ్మెట ఉమాదేవిలకు సారస్వత పరిషత్తు 2026 సంవత్సరానికి తెలంగాణ ఉత్తమగ్రంథ పురస్కారాలు ప్రదానం చేసి అభినందించారు. పురస్కారం కింద ఒక్కొక్కరికి 20వేల రూపాయల నగదు, జ్ఞాపిక,ప్రశంసాపత్రం, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వేముగంటి శుక్తిమతి, చింతపట్ల సుదర్శన్, డా. జి.లమృతలత, కొమురవెల్లి అంజయ్యలను ఘనంగా సన్మానించి వరిష్ట పురస్కారాలను ప్రదానం చేశారు.

ప్రజలకు ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం అందాలి : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

చిక్కడపల్లి మే 14 (ప్రభాతవార్త) : ప్రజలకు ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం అందాల్సి న అవసరం ఉందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. గురువారం విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక విద్యాసప్తాహంలో భాగంగా ఆలుమ్ని అసోసియేషన్ సమావేశం, పేరెంట్స్ మీటింగ్, మెగా హెల్త్ క్యాంప్ కార్యక్రమాలు కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ కె. ప్రభ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ విద్య, వైద్యం ప్రజలకు భారంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వాలు కార్పొరేట్ స్థాయి విద్య, వైద్య సేవలను ఉచితంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కళాశాల నుంచి చదివిన అనేక మంది ప్రజాప్రతినిధులు, బ్యూరోక్రాట్లు, పారిశ్రామికవేత్తలు, ఉద్యోగస్తులుగా ఎదిగారని తెలిపారు. పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బాల భాస్కర్ మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ప్రస్తుత కాలానికి అనుగుణంగా ఉద్యోగావకాశాలను కల్పించే కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా. ఆర్. లావణ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. పి. పద్మజ, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. అనురాధ, ఆలుమ్ని కోఆర్డినేటర్ రమావత్ శ్రీనివాసులు, ఆలుమ్ని సభ్యులు డా. శ్రీనివాస రావు, పూర్వ విద్యార్థులు జి. ఉపేందర్, సిహెచ్. రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ ఫోటో జర్నలిస్టు రఘురాయ్ : శ్రీనివాస్‌రెడ్డి

రఘురాయ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు

సైఫాబాద్, మే 14 ప్రభాతవార్త: భారత దేశంలో గర్వించదగ్గ ఫోటో జర్నలిస్ట్ రఘురాయ్ అని తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. తాను తీసిన ఫోటోలతో భారతదేశాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప ఫోటో జర నలిస్ట్ రఘురాయ్ అని ఆయన ప్రసంసించారు. తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన పద్మశ్రీ రఘు రాయ్ సంస్మరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఫోటోల భవిష్యత్తు తరతరాలకు మంచి ఆలోచనలు కల్పిస్తాయని, కల్చర్, లైఫ్, బంగ్లాదేశ్ యుద్ధం, భోపాల్ గ్యాస్, దలైలామా, మదర్ థెరెస్సా, ఇందిరాగాంధీ తదితర గొప్ప వ్యక్తుల ఫోటోలు తీసిన రఘురాయ్‌కు గొప్ప పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చాయని శ్రీనివాస్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సభలో పాల్గొన్న టియుడబ్ల్యుజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విరాహత్‌అలీ, కె.రాంనారాయణ, ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.నరహరి, గంగాధర్, అనిల్‌కుమార్ తదితరులు రఘురాయ్ చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు.

సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

అత్తాపూర్ మే14 ,ప్రభాతవార్త : నియోజకవర్గ సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరై జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి నియోజకవర్గంలోని వివిధ సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ముఖ్యంగా జిహెచ్‌ఎంసి, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖలకు సంబంధించి పెండింగ్‌లోని పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా,అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.వర్షాకాలం మరియు మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగం, వాటర్ వర్క్స్ ,విద్యుత్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తొమ్మిది డివిజన్లకు కొత్త కాంగ్రెస్ అధ్యక్షులు

చార్మినార్,మే 14 ప్రభాతవార్త : పాతబస్తీ బహదూర్‌పుర నియోజకవర్గంలోని తొమ్మిది డివిజన్లకు నూతన కాంగ్రెస్ కమిటి అధ్యక్షులను టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ నియమించారని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపుల్లా, బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ పులిపాటి రాజేష్ కుమార్‌తెలిపారు.దూద్‌బౌలి డివిజన్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులుగా సింగం బానుచందర్ యాదవ్, శాలిబండ డివిజన్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులుగా ఓరం ప్రియాంక,ఫలక్‌నుమా డివిజన్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులుగా మెహమ్మద్ ఖాలేద్,జహానుమా డివిజన్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులుగా నసీర్ ఫరూఖ్,నవాబ్ సాహెబ్ కుంట డివిజన్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులుగామెహరాజ్ బేగం,తీగలకుంట డివిజన్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులుగా షెహనాజ్ బేగం,చందూలాల్‌బారాదరి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా షేక్ జలీల్,రంనాస్‌పుర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులుగా సయ్యద్ గౌస్ అలీ,కిషన్‌బాగ్ డివిజన్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులుగా మహ్మద్ నజీర్ ఖాన్ నియమితులయ్యారని వారు వెల్లడించారు.

అధికారులు తీరుపై డీవీఎంసీ సమావేశంలో ఎమ్మెల్యే మర్రి అసంతృప్తి

-ఎస్సి, ఎస్టి కేసులు విచారణ జాప్యంపై ఆగ్రహం

సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే

అల్వాల్, మే 14 ప్రభాతవార్త: అల్వాల్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన డీవీఎంసీ సమావేశంలో అధికారులు తీరుపై మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అసంతృప్తిని వ్యక్తం చేశారు. గత సమావేశానికి చెందిన మినిట్స్‌ను పొందుపరచక పోవడంపై ప్రశ్నలు వర్షం కురిపించారు. ఆర్డీఓ శ్యాం ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్సీ ఎస్టీ కమీషన్ సభ్యుడు జిల్లా శంకర్‌తో పాటుగా పోలీసు, రెవెన్యూ ఇతర శాఖలకు చెందిన అధికారులు పాలు పంచుకున్నారు. అల్వాల్‌కు చెందిన పద్మిని కేసు రెండున్నర సంవత్సరాలుగా కొనసాగుతోందని ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రశ్నించారు. దళిత మహిళకు న్యాయం చేయలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మల్కాజిగిరి పోలీసు స్టేషన్‌లో హేమంత్ పటేల్‌పై నమోదైన ఎస్సీ ఎస్టీ కేసును యంత్రాంగం సమగ్రంగా విచారణ జరపాలని కోరారు. ఎస్సీ ఎస్టీ కేసులు పలు సందర్భాలుతో దుర్వినియోగం అవుతున్నాయని అల్వాల్, మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, జవహర్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇటువంటి కేసులు అధికంగా నమోదు అవుతున్నాయని పేర్కొన్నారు. అల్వాల్ మండలంలోని సర్వే నెంబర్లు 582, 583 ఉన్న యుఎల్‌సి భూములులో దశాబ్దాలు కాలంగా నివసిస్తున్న వడ్డెర ప్రజలకు నోటీసులు జారీ చేయడంపై రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించడం జరిగింది. యాదమ్మనగర్ గుడిసె వాసులకు బల్క్ మీరట్లు కేటాయించాలని పలు మార్లు కోరినా స్పందన లేదన్నారు. అంబేద్కర్ నగర్, ఇందిరా నగర్‌లలో ఉన్న బెల్టు దుకాణాలు తొలగించాలని ఫిర్యాదు చేసినా ఫలితం లేదని పేర్కొన్నారు. గంజాయి మత్తులో యువత నష్ట పోతున్నారని పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. సివిల్ రైట్స్ సమావేశం నిర్వహిస్తున్నా మినిట్స్ ఇవ్వక పోవడంతో ప్రయోజనం ఉండడం లేదని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో డీవీఎంసీ సభ్యులు బిట్ల వెంకటేశ్వర్లు, శరణగిరి, రాములు, అశోక్ కుమార్, ఏఎస్‌డబ్ల్యూఓకు చెందిన గోపీచంద్, అడిషనల్ డీసీపీ సుదర్శన్‌తో పాటుగా కుత్బుల్లాపూర్ ఏసీపీ బాల గంగిరెడ్డి, మల్కాజిగిరి ఏసీపీ యాదగిరి రెడ్డి, బేగంపేట్ ఏసీపీ గోపాల క్రిష్ణ మూర్తి, అడిషనల్ డీసీపీ సుదర్శన్‌తో పాటుగా తహసీల్దార్లు, ఎస్‌ఎచ్‌ఓలు, రెవెన్యూ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆదివాసి రాష్ట్రం ఏర్పాటుకు జాతీయ మహాసభ తీర్మానం

సభలో పాల్గొన్న విశ్రాంత ఐఏఎస్ అధికారులు డాక్టర్ పివి రమేష్, చిరంజీవులు, విశ్రాంత డీజీపీ డాక్టర్ డాక్టర్ జె. పూర్ణచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే లింగయ్య దొర తదితరులు

చిక్కడపల్లి మే 14 (ప్రభాతవార్త) : కోయతూరు భాషకు రాజ్యాంగ గుర్తింపు కల్పించాలని, 2027 జనగణనలో ఆదివాసీ మతం"కు ప్రత్యేక కోడ్ కేటాయించాలని ఆదివాసీ నాయకులు, మేధావులు డిమాండ్ చేశారు. దేశంలోని 5వ, 6వ షెడ్యూల్ ఆదివాసీ ప్రాంతాలను సమీకరించి ప్రత్యేక"ఆదివాసి రాష్ట్రం" ఏర్పాటు చేయాలని వారు కోరారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జాతీయ ఆదివాసి రాజ్యాంగ హక్కులు - సంస్కృతి పరిరక్షణ సమన్వయ సమితి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మహాసభ నిర్వహించారు. మా ఊళ్లో - మా రాజ్యం" నినాదంతో జరిగిన ఈ సభలో పలు కీలక తీర్మానాలను ఆమోదించారు. సభకు అధ్యక్షత వహించిన జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్యదొర మాట్లాడుతూ.. ఆదివాసుల ఉనికిని కాపాడుకునేందుకు ఐక్య పోరాటాలు అవసరమన్నారు. మాజీ డీజీపీ డాక్టర్ జె. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ కోయతూరు భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. భాష, సంస్కృతిని కోల్పోతే ఆదివాసుల ప్రత్యేక అస్తిత్వానికే ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 5వ షెడ్యూల్, 6వ షెడ్యూల్ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసుల భూమి, అటవీ హక్కులు, స్వయం పాలన రక్షణ కోసం ప్రత్యేక ఆదివాసి రాష్ట్రం" అవసరమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజారావు మాట్లాడుతూ పోలవరం, మైనింగ్, కార్పొరేట్ ప్రాజెక్టుల కారణంగా ఆదివాసులు పెద్దఎత్తున నిర్వాసితులవుతున్నారని ఆరోపించారు. పెసా చట్టం, 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం అమలులో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. పెసా చట్టం, అటవీ హక్కుల చట్టం, 1/70 చట్టం అమలుపై గవర్నర్ ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. ఈ డిమాండ్లను విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ పివి రమేష్, చిరంజీవులు సమర్థించారు. సభలో కోఆర్డినేటర్ పొడుగు శ్రీనాథ్, రాష్ట్ర కన్వీనర్లు పాయం సత్యనారాయణ, వరవి నర్సింగరావు, ఆదివాసీ మేధావులు, మహిళా నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ వచ్చినా ఎస్సీ,ఎస్టీ,బిసిలకు ఫలాలు దక్కడం లేదు

ధర్మరాజుకు నియమాకపత్రాన్ని అందజేస్తున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

సైఫాబాద్, మే 14 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఫలాలు ఎస్సీ, ఎస్టీ, బిసిలకు దక్కడం లేదని, కేవలం రెండు, మూడు శాతం జనభా కలిగిన దోపిడి కులాలకే లబ్ధి చేకూరుతున్నదని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. దళిత, బహుజన వర్గాలు 1200 మంది తెలంగాణ కోసం ఆత్మబలిదానాలు చేసుకుంటే పాలక వర్గాలు ఆ వర్గాల గురించి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గురువారం నాడిక్కడ పార్టీ కేంద్ర కార్యాలయంలో నాగర్‌కర్నూల్‌కు చెందిన బిసి ఉద్యమ నాయకుడు బి.ధర్మరాజును పార్టీ రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్‌గా నియమించి నియామకపత్రాన్ని అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గౌతమ బుద్ధిని బోధనలతో, మహాత్మా జ్యోతిరావ్‌పూల్, డా.బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలతో ధర్మరాజు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని మరింతగా బలపరుస్తారన్న ఆశయాన్ని ఆయన వ్యక్తం చేశారు. దళిత, బహుజన కులాలకు బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రభుత్వాల హాయంలో తీరని అన్యాయాలు జరిగాయని, రాజ్యాధికార సాధన ద్వారానే దళిత, బహుజనులకు విముక్తి లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో అగ్రకుల దోపిడీ పార్టీలను చిత్తుగా ఓడించాలని, ఇందుకోసం ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

అర్హులైన పేదలందరికి డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేస్తున్న నర్సయ్యగౌడ్

ముషీరాబాద్, మే 14 ప్రభాతవార్త: నగర వ్యాప్తంగా అర్హులైన పేదలందరికి ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించాలని తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మేకపోతుల నర్సయ్యగౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పథకం అమలు జరుగుతున్నప్పటికి హైదరాబాద్ నగరంలో అమలు జరగడం లేదని ఆరోపించారు. ఈ మేరకు గురువారం జన సమితి ముషిరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ముషిరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో కొంత మందికి ముషిరాబాద్ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూంలు కేటాయించినప్పటికి పోజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వలేదని, తక్షణమే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

రాజు అజయ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపిన రమేష్ బాబు

నిజాంపేట్, మే 14, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర వాషర్మెన్ (రజక) కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన దాసరి రాజు అజయ్ కుమార్ గురువారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాల నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రగతి నగర్ 276 డివిజన్ నాయకుడు రమేష్ బాబు పాల్గొని దాసరి రాజు అజయ్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రజక సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం ఆయన సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రజక వర్గాల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఆ దిశగా కార్పొరేషన్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

పాత ఒప్పందం ప్రకారం రిజిస్ట్రేషన్ చేయాలి

సైఫాబాద్, మే 14 ప్రభాతవార్త: ఒప్పందం ప్రకారం డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా మానసిక వేదింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై ప్రభుత్వం, కురుమ సంఘం నాయకులు తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితుడు చిత్తరంజన్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఆర్కేపల్లి గ్రామంలోని సర్వే నెంబరు 98లోగల 3 ఎకరాల 23 గుంట భూమిలో కొండ సురేష్ నుంచి ఎకరం 23 గుంటలు, చింత వికాస్ నుంచి ఎకరం 22 గుంటల భూమిని గతంలో కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కాగా చింత వికాస్ భూమికి రిజిస్ట్రేషన్ విషయంలో ఒప్పందం ప్రకారం చేయకుండా తనని మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ప్రస్తుతం భూమి రేట్లు పెరిగాయని, ఆ ప్రకారంగా డబ్బులు చెల్లించాలని చింత వికాస్ డిమాండ్ చేస్తూ భూమిని రిజిస్ట్రేషన్ చేయడం లేదన్నారు. తొలుత ఒప్పందం ప్రకారం చింత వికాస్ తనవద్ద డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా వేధించడం సమంజసం కాదన్నారు. ఈ విషయంపై పోలీస్ అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, కురుమ సంఘం నాయకులు జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

ఆర్టీసి బస్సు కారు ఢీ .. వృద్ధుడు మృతి

చాంద్రాయణగుట్ట, మే 14, ప్రభాతవార్త :

సిగ్నల్ దాటే క్రమంలో ఆర్టీసి బస్, ఇన్నోవాకారు ఒకదానికొకటి ఢీకొని రోడ్డు దాటుతున్న ఒక వృద్ధుడు తీవ్ర గాయాలుకు గురై మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చాంద్రాయణగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి కథనం ప్రకారం... బార్కాస్‌కు చెందిన అబిద్ హాస్మీ (65) కూరగాయల కోసం ఫలక్‌నుమా వెళ్లాడు. తిరిగి రాత్రి పదిన్నర గంటల ప్రాంతంలో ఎంబిఎన్ఆర్ చౌరస్తా వద్ద బార్కాస్ వైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో బండ్లగూడ నుండి వచ్చిన ఇన్నోవా కారు డ్రైవర్ మొహినుద్దీన్ అతనిని గమనించి ఉన్నఫళంగా బ్రేక్ వేశాడు. దాని వెనుకే వస్తున్న బండ్లగూడ డిపోకు చెందిన ఆర్టీసి బస్సు ఇన్నోవా కారను ఢీ కొట్టింది. దీంతో కారు అదుపుతప్పి రోడ్డు దాటుతున్న అబిద్ హాస్మీని బలంగా తాకింది. ఈ సంఘటనలో వృద్ధుడు కారు క్రింద ఇరుక్కుపోయి తీవ్ర గాయాలకు గురైయ్యాడు. అతని చేతిలోని పాలిథిన్ కవరు చిరిగిపోయి కూరగాయలు చెల్లా చెదురైయ్యాయి. విషయం తెలుసుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్ జె.కిరణ్ కుమార్ అక్కడికి చేరుకొని స్థానికుల సహాయంతో కారు క్రింద ఇరుక్కుని గాయపడ్డ వృద్ధుడు అబిద్ హాస్మీని హుటాహుటిని ఉస్మానియాకు తరలించారు. మార్గ మధ్యంలో అతడు కన్నుమూశాడు. బాధితుడి కుమారుడు అబ్దుల్ జబ్బార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కారు డ్రైవర్ మొహినుద్దీన్ (35), ఆర్టీసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురి ప్రాణాలు కాపాడిన రాంగోపాల్‌పేట పోలీసులు.

బేగంపేట మే 14,ప్రభాతవార్త

క్షణికావేశంలో ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ వివాహితతో పాటు ఇద్దరు చిన్నారుల ప్రాణాలను రాంగోపాల్‌పేట పోలీసులు సకాలంలో స్పందించి కాపాడారు.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.జీడిమెట్లకు చెందిన 23ఏళ్ల యువతికి రెండేళ్ల క్రితమే భర్త దూరమయ్యాడు.అప్పటి నుంచి ఆమె తన నాలుగేళ్ల కుమారుడు,ఏడాదిన్నర వయస్సున్న కుమార్తెతో కల్సి పుట్టింట్లో నివసిస్తుంది.అయితన గత కొంత కాలంగా ఆమె నడవడికపై అనుమానం పెంచుకున్న కన్నవారు, సోదరుడు ఆమెను వేధింపులకు గురిచేస్తున్నారంటూ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.కుటుంబ సభ్యుల వేధింపులు భరించలేక తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె తన ఇద్దరు బిడ్డలతో కల్సి హుస్సేన్ సాగర్ లో దూకి ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశ్యంతో అక్కడికి చేరుకుంది.గురువారం ఉదయం గం 11.30నిల సమయంలో విషయం తెల్సుకున్న రాంగోపాల్‌పేట పోలీసులు తక్షణమే స్పందించారు.ఆమెను అడ్డుకుని రాంగోపాల్‌పేట పోలీసుస్టేషన్ కు తరలించారు.ఇన్స్‌పెక్టర్ బి.సురేష్ కుమార్ ఆమెకు కౌన్సిలింగ్ నిర్వహించారు.వారికి రక్షణ కల్పించి మరోసారి కౌన్సిలింగ్ కోసం సఖి సెంటర్ 2కు తరలించినట్లు రాంగోపాల్‌పేట ఇన్స్‌పెక్టర్ బి.సురేష్ కుమార్ తెలియజేసారు.

సెంట్రింగ్ కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్



సెంట్రింగ్ బంద్ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

అడ్డగుట్ట,మే 14 ప్రభాతవార్త: సికింద్రాబాద్ భవన నిర్మాణ దారులు సెంట్రింగ్ నిర్మాణానికి చెల్లిస్తున్న రేట్ సరిపోవడం లేదని, వెంటనే సెంట్రింగ్ ధరలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16 నుంచి సెంట్రింగ్ కాంట్రాక్టర్లు,కార్మికులు తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేసేందుకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని అడ్డగుట్ట కాంట్రాక్ట్ అసోసియేషన్ నాయకులు మల్లేశ్,రాములు తెలిపారు.గురువారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ చేతుల మీదుగా విడుదల చేసిన గోడ పత్రికను ఆఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు,సెంట్రింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. భవన నిర్మాణ దారులు చెల్లిస్తున్న రేట్ సరిపోవడం లేదని,వారు చేస్తున్న న్యాయమైన కోర్కెల సాధనకు ఎల్లప్పుడు తమ మద్దతు ఉటుందన్నారు.ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అబివృద్ధికి దాతలు ముందుకు రావాలి

రెజిమెంటల్ బజార్ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మహావీర్ ఇంటర్నెషనల్ హుడాన్

అడ్డగుట్ట,మే 14 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు పాఠశాల భవనాల్లో మౌళిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని మోండా డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు సి.బద్రి నాథ్ యాదవ్,సి.వైష్ణవి యాదవ్, సంతోష్ యాదవ్‌లు తెలిపారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ ఆదేశాల మేరకు గురువారం మోండా డివిజన్ రెజిమెంటల్ బజార్‌లోని ప్రభుత్వపాఠశాల భవన నిర్మాణానికి మహారీవర్ ఇంటర్నెషనల్ హుడాన్ సంస్థ చేపట్టిన భూమి పూజ వేడుకల్లో వారు పాల్గొన్నారు. కోటి రూపాయల వ్యయంతో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి మహావీర్ ఇంటర్నెషనల్ హుడాన్ సంస్థను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో మహావీర్ ఇంటర్నెషనల్ హుడాన్ ప్రాజెక్ట్ హెడ్ మహావీర్ లోహియ,చైర్ పర్సన్ అర్థి చొరలియా, వైస్ చైర్మన్ నవీన్ దస్సాని, కార్యదర్శి ఆదిత్య పరక్, కోశాధికారి అక్షయ్ సురాన,కాంగ్రెస్ నాయకులు నాగేశ్ యాదవ్, నందికంటి రవి, గుజ నాగేందర్ యాదవ్, శ్రీనాథ్, టీచర్ సెడ్రిక్ తదితరులు పాల్గొన్నారు.

సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం

దరఖాస్తును అందజేస్తున్న దశ్యం

సికింద్రాబాద్, మే 14 ప్రభాతవార్త: దళిత సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో జరిగింది. ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భేటీకి ఉమ్మడి హైదరాబాద్ జిల్లా అబ్జర్వర్ హెచ్.ఆర్. మోహన్ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతం, ఎస్సీ విభాగం రాష్ట్ర, జిల్లా కమిటీల పునర్వ్యవస్థీకరణపై ఈ సందర్భంగా లోతుగా చర్చించారు.జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపేలా జరిగిన ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్, ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ సాయి మధుకర్ గౌరవ అతిథులుగా పాల్గొని ఆశావహులతో భేటీ అయ్యారు. జిల్లా స్థాయి పదవుల కోసం భారీగా పోటీ నెలకొనగా, సుమారు 30 మందికి పైగా అభ్యర్థులు తమ దరఖాస్తులను పరిశీలకులకు అందజేశారు. సమర్థులైన వారికే పదవుల్లో ప్రాధాన్యం ఉంటుందని నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నేతలకు దీపక్ జాన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రేమ్‌నగర్‌లో కల్లు కాంపౌండ్‌కు వ్యతిరేకంగా భారీ ధర్నా

కల్లు కాంపౌండ్ ఏర్పాటును నిరసిస్తూ ఆందోళన చేస్తున్న స్థానికులు

జూబ్లీహిల్స్, మే 14, ప్రభాతవార్త:
ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్‌నగర్ ప్రాంతంలో కల్లు కాంపౌండ్ ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక మహిళలు, యువకులు భారీ స్థాయిలో ధర్నా నిర్వహించారు. చింతల్‌బస్తీ నుంచి సాయిబాబా గుడి రోడ్డులో ఏర్పాటు చేస్తున్న కల్లు కాంపౌండ్ కారణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రహదారి ఆనంద్‌నగర్ కాలనీ, వెంకటరమణ కాలనీ ప్రజలకు ప్రధాన మార్గమని, కల్లు కాంపౌండ్ వల్ల రాకపోకలకు ఆటంకం కలుగుతోందని స్థానికులు తెలిపారు. వెంటనే కల్లు కాంపౌండ్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి పాల్గొని స్థానిక ప్రజలకు మద్దతు తెలిపారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ చైర్మన్ విప్లవ్ కుమార్ కూడా ధర్నాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, నవీన్, శ్రీధర్ యాదవ్, ప్రవీణ్, శివరాజ్, నరేష్ తదితర స్థానిక నాయకులతో పాటు మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జిహెచ్ఎంసి ఎన్నికల్లో పోటీ చేయనున్న ఆశావాహులు ధరఖాస్తులు సమర్పించాలి

చార్మినార్,మే 14 ప్రభాతవార్త : జిహెచ్ఎంసి, సైబరాబాద్,మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేయనున్న ఆశావాహులు టిక్కెట్లు కోసం ధరఖాస్తులను దారుసలాంలోని ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యాలయంలో సమర్పించాలని పార్టీ పిఆర్ఓ తెలిపారు.మే నెల 13వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు ధరఖాస్తులను స్వీకరిస్తున్నారు.ప్రతీ రోజు ఉదయం 11 నుంచి సాయంత్రం 5గంటల మధ్య టిక్కెట్లు ఆశిస్తున్న ఆశావాహులు తమ ధరఖాస్తులను దారుసలాంలోని ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యాలయంలో అందజేయాలని పిఆర్ఓ ఒక ప్రకటనలో తెలిపారు.

నిమ్స్‌లో స్వచ్ఛంద రక్తదాన అవగాహన ర్యాలీ

ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ నగరి బీరప్ప, పాల్గొన్న వైద్యులు, నర్సులు.

జూబ్లీహిల్స్, మే 14, ప్రభాతవార్త:
నిమ్స్‌లో ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్, ఇమ్యునోహీమటాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛంద రక్తదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎమర్జెన్సీ గేట్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పంజాగుట్ట గేట్ వరకు కొనసాగింది. ర్యాలీ అనంతరం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ, రక్తదానం ప్రాణాలను కాపాడే మహోన్నత సేవ అని, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని యూ బ్లడ్ అప్" వ్యవస్థాపకులు జగదీష్ బాబు యలమంచిలి సహకారంతో నిర్వహించారు. నిమ్స్‌కు తమ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. నమోదు చేసిన రక్తదాతలను సమీకరించి నేరుగా సంస్థకు అనుసంధానం చేసే విధంగా సాంకేతిక సహకారం అందిస్తామన్నారు. దీని ద్వారా రక్త యూనిట్ల సరఫరా మరింత స్థిరంగా, సమర్థవంతంగా మారే అవకాశం ఉందని తెలిపారు.అవగాహన కార్యక్రమంలో ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్, ఇమ్యునోహీమటాలజీ విభాగ అధ్యాపకులు రక్తదాన అవసరం, ప్రాముఖ్యత, సామాజిక బాధ్యతపై ప్రసంగించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ హెచ్ఓడీ డా. సుదీర్ వుజ్జిని, డా. కె. మహేష్, డా. బి. శాంతి, డా. మార్త రమేష్, మీడియా రిలేషన్ అధికారి సత్యగౌడ్, అలైడ్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఫిజియోథెరపీ, ఎంహెచ్ఎం, నర్సింగ్, అలైడ్ సైన్స్ విద్యార్థులు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, యూ బ్లడ్ అప్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

జీటీఎస్ దేవాలయం అర్చకులు, సిబ్బందికి జీతల పెంపు

దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహణా అధికారి గుమ్మడిదల సుధాకర్‌ను ఘనంగా సన్మానిస్తున్న ఆలయ అర్చకులు, సిబ్బంది.

యూసుఫ్‌గూడ మే 14 ప్రభాతవార్త :
జీటీఎస్ కాలనీలోని శ్రీ వీరాంజనేయ భవానీ శంకర అయ్యప్ప శ్రీ సాయిబాబా దేవస్థానంలో నిత్యం పూజలు నిర్వహించే పూజారులు, ఆలయంలో పనిచేసే సిబ్బందికి వారి నెలసరి జీతాలు పెంచటంతో ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా తాము ఆలయ అభివృద్ధికి పనిచేస్తూ భక్తుల మనోభావాలకు అనుగుణంగా నిత్య పూజలు జరిపిస్తున్న తమకు నెలసరి జీతాలు పెంచటంలో ఆలయ కార్యనిర్వాహణా అధికారి డాక్టర్ గుమ్మడిదల సుధాకర్ ఎంతో కృషి చేశారని ఆయన కృషి వల్లనే తమకు జీతాలు పెరిగాయంటూ ఆలయం వద్ద శాలువులతో పూలతో ఘనంగా సత్కరించారు. ఎంతో పేరు ప్రతిష్టలు ఉన్న జీటీఎస్ దేవాలయం 2017లో దేవాదాయ ధర్మాదాయశాఖ స్వీకరించిన తర్వాత ఆగస్టు 2024లో గుమ్మడిదల సుధాకర్ కార్యనిర్వాహణాధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆరోజు నుంచి భగవంతుకుని ప్రతి రోజు దూప దీప నైవేద్యము సక్రమంగా జరిగేలా చూస్తున్నారని నిత్య నైవేద్యం, నిత్య అలంకారములు, అన్నదానములు సక్రమంగా జరిగేలా చూస్తున్నారని పేర్కొన్నారు. ఈవోగా బాధ్యతలు స్వీకరించనప్పటి నుంచి భక్తులందరికీ మంచినీటి సౌకర్యం, అమ్మవారి నవరాత్రుల కాలంలో అలంకారములు, పూజలను విశేషంగా నిర్వహించటం జరుగుతుంది. దేవాలయం ఎండోన్‌మెంట్ అయిన తర్వాత 9 ఏళ్ల వరకు సిబ్బందికి తక్కవ జీతంతో పనిచేస్తున్న సిబ్బందికి ఎండోన్‌మెంట్ డిపార్ట్‌మెంట్ సహకారంతో అందరికీ సమానంగా జీతాలు పెంచి అందివ్వడం జరుగుతుంది. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తూ ఆలయ ప్రతిష్టతను కాపాడుతూ సిబ్బంది మన్ననలను పొందుతున్నారు.

రాహుల్‌కు అవార్డు ప్రదానం

రాహుల్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

సైఫాబాద్, మే 14 ప్రభాతవార్త:
బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కులు, రక్షణ కోసం గత 15 సంవత్సరాలుగా విశేషంగా కృషి చేసిన సాధన స్వచ్ఛంద సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు సిక్కు రాహుల్‌కు జీవ్రాన్ ఫౌండేషన ద్వారా 'విశ్వరత్న గౌరవ్ సమ్మాన్–2526' అవార్డు లభించింది. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం నాడిక్కడ రాహుల్‌కు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ సాధన స్వచ్ఛంద ప్రారంభించి మూడు దశాబ్దాలు పూర్తి అయ్యిందని, తాను రాష్ట్రంలోని 5 జిల్లాలు మెదక్, కామారెడ్డి, వికారాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో బాల్య వివాహాల నిర్మూలన, హింస, వేధింపులు, మానసిక ఆరోగ్యం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, నిరక్షరాస్యత, బాలల అక్రమణ రవాణా, పేదరికంపై గత 15 సంవత్సరాలుగా విశేషంగా కృషి చేయడం జరిగిందన్నారు. తన సేవలకు గాను ఢిల్లీలోని జీవ్రాన్ ఫౌండేషన్ ద్వారా ఈ అవార్డు లభించిందన్నారు. భవిష్యత్తులో బాలలకు మరిన్ని సేవలు అందించాలనే ద ృక్పథంతో ఉన్నానని చెప్పారు.

అర్హులైన వారికి ఇండ్ల పంపిణి చేస్తాం

: టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్



ఇందిరమ్మ ఇండ్ల కోసం ధరఖాస్తు జాబితాను అందచేస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దం సతీష్‌గౌడ్

గన్‌ఫౌండ్రి,మే 14ప్రభాతవార్త: ప్రజా పాలనలో గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని అర్హులైనవారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఖైరతాబాద్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దం సతీష్‌గౌడ్ కోరారు.ఇందిరమ్మ ఇండ్లకోసం ధరఖాస్తు చేసుకున్న వారి జాబితాను అందచేయగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.వెంటనే ఇందిరమ్మ ఇండ్ల కోసం ధరఖాస్తులను సంబంధిత అధికారులకుఅందచేయాలని సూచించారు.అర్హులైన వారికి ఇండ్లను అందే విధంగా చూస్తానని హామి ఇచ్చినట్లు తెలిపారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత : ఎమ్మెల్యే



యూసుఫ్‌నగర్‌లో శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ప్రాణ ప్రతిష్ఠోత్స వ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్.

యూసుఫ్‌గూడ మే 14 ప్రభాతవార్త :
దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చూకూరుతుందని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌నగర్ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ప్రాణ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణారావుతో పాటు మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ ఆలయాల పవిత్రను కాపాడుకునే విధంగా ఎప్పటికప్పుడు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించుకోవటం ఆనందకరమైన విషయమని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నార్లపురం నాగరాజు, నరసింహాతో పాటు స్థానిక నాయకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తులం బంగారం ఇస్తామని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ : ఎమ్మెల్యే కృష్ణారావు

లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం

కెపిహెచ్‌బి కాలనీ, మే 14, ప్రభాతవార్త
ఎన్నికల సమయంలో తులం బంగారం ఇస్తామని మాటలు చెప్పి ఆడపిల్లలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి సర్కిల్‌కు చెందిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకంలో భాగంగా 151 మంది లబ్ది దారులకు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనాడు ఎంతో మానవతా దృక్పథంతో పేదింటి ఆడబిడ్డ పెళ్లయితే వారికి అండగా ఉండేందుకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రారంభించారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు హామీలు ఇచ్చి తులం బంగారం కూడా ఇస్తామని చెప్పి ఆడబిడ్డలను మోసం చేసిందని ఆరోపించారు. బి.ఆర్.ఎస్ హయాంలో దేశంలో ఎక్కడా లేనటువంటి రైతుబంధు, రైతు బీమా మిషన్ భగీరథ, వంటి గొప్ప కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శమే కాకుండా దేశానికి ఆదర్శమయ్యాయని తిరిగి మళ్ళీ ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను ప్రజలు ఎన్నుకుంటారని ఆ రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సబియా గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

హనుమంత్ రావుకి అభినందనల వెల్లువ

వి.హనుమంతరావును కలిసిన రాష్ట్ర బీసీ నాయకులు

కూకట్‌పల్లి, మే 14, ప్రభాతవార్త
బీసీల సంక్షేమం అభివృద్ధి కోసం మంత్రివర్గ హోదాతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావుని పలువురు కలిసి అభినందనలు తెలియజేశారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ, రాష్ట్ర బీసీ నాయకులు పోతుల రాజేందర్ పటేల్, రాకేష్ పటేల్, నరేందర్ రెడ్డి తదితరులు వి.హనుమంతరావును కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెల్ల హరికృష్ణ మాట్లాడుతూ బీసీ సమాజానికి దశాబ్దాలుగా అండగా నిలిచిన హనుమంత రావు అనుభవం, పోరాటం ఈ కొత్త బాధ్యతలో బీసీల అభివృద్ధికి మరింత ఊతమివ్వాలని ఆకాంక్షి స్తున్నామని అన్నారు. ఆయన సేవలు, సలహాలు తెలంగాణ బీసీల ఆత్మగౌరవాన్ని, సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయాలని కోరుకుంటున్నామనీ ఆశాభవం వ్యక్తం చేశారు.

వడ దెబ్బకు వృద్ధురాలు మృతి

మైలార్‌దేవ్‌పల్లి,మే 14 ప్రభాతవార్త : ఎండ వేడిమిని తట్టుకోలేక వడ దెబ్బకు ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన గురువారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.సబ్‌ఇన్‌స్పెక్టర్ పైడి నాయుడు కథనం ప్రకారం మెదక్‌జిల్లాకు చెందిన మణిమ్మ (62) తన ఇద్దరు కొడుకులతో కలిసి లక్ష్మీనగర్‌లోని రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్నది.భర్త మెదక్‌జిల్లాలోని సొంత గ్రామంలో ఉంటున్నాడు.కాగా ఎండలు తీవ్రంగా ఉండటంతో తట్టుకోలేక గురువారం మధ్యాహ్నం మణిమ్మ ఇంటి వద్దనే మృతి చెందింది.మణిమ్మ కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మణిమ్మ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.వడ దెబ్బ వల్లనే మణిమ్మ మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావి స్తున్నారు.ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సందడిగా యూనివర్సిటీ ఆఫ్ రొహింప్టన్ లండన్ మీట్ అండ్ గ్రీట్

మీట్ అండ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్న యూనివర్సిటీ ఆఫ్ రొహింప్టన్ లండన్ వీసీ జాన్ వాల్..

జూబ్లీహిల్స్, మే 14, ప్రభాతవార్త:
యూనివర్సిటీ ఆఫ్ రొహింప్టన్ లండన్ మీట్ గ్రీట్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. బంజారాహిల్స్ లో గురువారం యూనివర్సిటీ ఆఫ్ రొహింప్టన్ మీట్ ద గ్రీట్ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ రొహింప్టన్ లండన్ వైస్ ఛాన్సిలర్ జాన్ వాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత మూస కోర్సులు చదువుకునేందుకు ఇష్టపడటం లేదని ఎప్పటికప్పుడు సరికొత్త కోర్సులు చదువుకోవడానికి ఇష్టపడుతున్నారన్నారు. యూనివర్సిటీ ఆఫ్ రొహింప్టన్ యూనివర్సిటీకి భారతీయ విద్యార్థులకు మంచి సంబంధాలు ఉన్నాయని ఇక్కడ లభించే కోర్సులకు ప్రతియేటా భారతీయ విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తున్నదన్నారు. టెక్నాలజీ కోర్సులు, సైబర్ సెక్యూరిటీస్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, రొబోటిక్స్ వంటి ఎన్నో అంశాలపై అధునాతన కోర్సులను విద్యార్థులకు ఈ యూనివర్సిటీ అందిస్తున్నదని తెలిపారు. ఒక వైపు చదువుకుంటూనే మరో వైపు ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నదని అన్నారు. యూనివర్సిటీ ఆఫ్ రొహింప్టన్ డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ అడ్మిన్ గులిని రిచర్డ్ మాట్లాడుతూ ప్రస్తుతం యూనివర్సిటీలో 12 వేల మంది విద్యార్థులు వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారని అన్నారు. సావరియా ఎడ్యుకేషన్ సంస్థ చైర్మన్ రాజేష్ గోయల్ మాట్లాడుతూ తొలుత 200 మంది తమ కన్సల్టెన్సీ నుంచి లండన్ వెళ్ళారని ఇప్పుడు 500 మందికిపైగా వెళ్తున్నారని అన్నారు.

సిసిరోడ్డు పనులు.. స్థానికులకు తప్పని తిప్పలు

ఇష్టానుసారంగా వేస్తున్న సిసి రోడ్డు దృశ్యం

బేగంబజార్,మే 14ప్రభాతవార్త: మహానగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారుల నిర్వాకంస్థానిక ప్రజల పాలిట శాపంగా మారిందని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త ఆరోపించారు.బేగంబజార్ డివిజన్‌లోని సిబిఎస్ వెనుక బస్తీలో నూతనంగా సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.పనులు చేపట్టడం బాగానే ఉన్నప్పటికి,ప్రజలకు మాత్రం ఇబ్బందులు,తిప్పలు తప్పడంలేదన్నారు.స్థానికులు వెళ్లేందుకు ఒకటే దారి ఉందని,జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు రెండు వైపుల్లా ఒకేసారి సిమెంట్ రోడ్డు పనులను నిర్మించడం ద్వారా స్థానికులు తమ నివాసాలకు వెళ్లేందుకు గాను అనేక అవస్థలకు గురయ్యారు.ఒక వైపు వేసిన తరువాత మరో వైపు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టడం ద్వారా సిసి రోడ్డు బలంగా ఉంటుందన్నారు.స్థానికుల వినతి మేరకు ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టే స్థలానికి చేరుకుని పనులను,స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, పరిశీలించారు. స్థానికులకు ఉపయోగపడే సిసి రోడ్డు వారి పాలిట శాపంగా పరిణమించిందన్నారు.ముందు చూపులేక పోవడంతో ఇష్టానుసారంగా సిసిరోడ్డు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.రెండువైపులా ఒకేసారి కాకుండా ఒక వరుస వేసిన తర్వాత మరో పక్క రోడ్డు నిర్మాణం చేట్టడం ద్వారా స్థానికులకు,ఇబ్బందులు కలుగకుండా ఉంటుందన్నారు.ఇంజనీరింగ్ అధికారులు పనులు జరుగుతున్న చోట అందుబాటు లో లేకపోవడం గమానార్హం అన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం తోడ్పాటు : సత్యం శ్రీరంగం

స్వీకార మహోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కెపిహెచ్‌బి కాలనీ, మే 14, ప్రభాతవార్త
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధర్మాన్ని కాపాడడంలో, బ్రాహ్మణుల సమాజ అభ్యున్నతికి ఎల్లప్పుడు కృషి చేస్తారనీ పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఈ పరిశ్రమలు, వాణిజ్యం శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌గా బసవరాజ శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా పొన్నాడ సుబ్రమణ్య ప్రసాద్‌లు పదవి బాధ్యతల స్వీకార మహోత్సవం గురువారం వసంత్ విహార్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హార్కర వేణుగోపాల్ రావు, స్టేట్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాల చారిలతో హాజరై డాక్టర్ సత్యం శ్రీరంగం శాలువాలతో సత్కారించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బ్రాహ్మణ సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సమాజంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా సమన్వయంతో పనిచేయాలని సత్యం శ్రీరంగం అన్నారు. శ్రీధర్ బాబు నాయకత్వంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు సహకరించి ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులను తీసుకువచ్చే బాధ్యత తీసుకోవాలని కోరారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం మరింత సమర్థవంతంగా పనిచేసి సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బ్రాహ్మణ సంఘాలు, ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత...

లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, మే 14, ప్రభాతవార్త : శేర్లింగంపల్లి నియోజకవర్గంలో పరిధిలో గల 41 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన పది హేను లక్షల ముప్పై ఏడు వేల ఐదు వందల రూపాయల చెక్కులను పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ గురువారం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, చంద్రమోహన్ సాగర్, నవీన్ రెడ్డి, రవి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహేష్ కుమార్ గౌడ్‌కు ఘన సత్కారం

మహేష్ కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నిజాంపేట్, మే 14, ప్రభాతవార్త
ఆనాపనసతి ధ్యానం పుస్తకాన్ని బహుమతిగా అందజేసిన వడ్డెర సంక్షేమ సంఘం నాయకురాలుగురువారం తెలంగాణ పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, మెడిటేషన్ మాస్టర్ కుంచపు రమ కలిసి శాలువాతో సత్కరించారు.వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అభినందనలు తెలియజేస్తూ, తమ అందరి గురువైన బ్రహ్మర్షి పితామః పత్రీజీ రచించిన ఆనాపనసతి ధ్యానం పుస్తకాన్ని బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా సమాజ సేవ, ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత, ఆత్మవికాసం సాధ్యమవుతాయని పేర్కొంటూ, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

పేదలు సిఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,మే 14 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. బోయిన్‌పల్లి సంజీవయ్య నగర్‌కు చెందిన రాజేందర్ కుమారుడు జాదవ్ శివప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిమ్స్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకునేందుకు మంజూరైన 1.75 ఎల్ఓసీ పత్రాన్ని గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు.

వార్త VAARTHA CLASSIFIEDS — CLASSIFIEDS — వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, CHANDARS VARAPRASAD, R/o H.No. 6-82, Pilligundla, Shankarpally, RR District-501203, have Changed My Name as CHANDERS VARAPRASAD RAO.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ GHMC

సంక్షిప్త టెండర్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ నిట్ నం. 8/EE/ Cir.40/SBZ/GHMC/2026-27, తేది: 13.05.2026, క్ర.సం.1, నిట్ నం.: ఫైన పేర్కొన్నది. పని పేరు: 11 సం. సివిల్ పనులు. అంచనా మొత్తం: 224.26 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ / చివరి తేదీ & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 16.05.2026 మ.3.00 గం. వద్ద. డౌన్‌లోడ్ ముగింపు తేది: 23.05.2026 మ.3.15 గం. వద్ద. పేరు, చిరునామా, కార్యాలయం & సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-40, GHMC, 7995007437. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-40, GHMC
DIPR.No.2411-PP/CL/Advt/1/2026-27, తేది: 14.05.2026

FORM NO.2 SUMMONS FOR SETTLEMENT OF ISSUES IN THE COURT OF HON'BLE I SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD SOP.No. 37 OF 2026

Between:
Nehanjali Srinivasan and another ...**Petitioners**
AND
All concerned & Anr. ...**Respondents**

To,
All Concerned
Notice is hereby given that, on the 21st day of April 2026, application was made to this court by petitioners herein for the grant of Succession Certificate under the Indian Succession Act, with respect to the share certificates of Late Pratush Saxena who died on 19.08.2024 and that the hearing has been fixed by the Hon'ble Court on 15th day of June, 2026 where you are at liberty to appear and oppose the same.
Take notice that in default of your appearance on the day before mentioned the suit will be heard and determined in your absence.
By Order of the Court
M/s. DMA ADVOCATES, DAMODAR MUNDRA, DINESH K GILDA, G. VENKATESH MAYUR MUNDRA, SHREYA MUNDRA DIVYA MUNDRA, RIDHI RANKA
#102, II Floor, KGN Plaza, Street No.8, Himayatnagar, Hyderabad.
Cell No.+91 9848080435

IN THE COURT OF HON'BLE XITH JUNIOR CIVIL JUDGE, AT :: SECUNDERABAD O.S. NO. 286 OF 2026
BETWEEN:
1. Sri. N. Krishna @ Krishnayya, S/o. N. Balaiah, Aged about 54 years, Occ: Pvt. Employee, R/o. H.No. 6-6-269/78, Arun Jyothi Colony, Gandhi Nagar, Secunderabad, Hyderabad-500003, Telangana State.
2. Mr. Nandhipeta Sai Madhav, S/o. Nandhipeta Krishnayya @ Krishna, Aged about23 years, Occ: Pvt. Employee, R/o. H.No. 6-6-269/78, Arun Jyothi Colony, Gandhi Nagar, Secunderabad, Hyderabad-500003. Telangana State.
3. Mr. Nandhipeta Chaithan Kumar, S/o. Nandhipeta Krishnayya @ Krishna, Aged about 21 years, Occ: Pvt. Employee, R/o. H.No. 6-6-269/78, Arun Jyothi Colony, Gandhi Nagar, Secunderabad, Hyderabad-500003. Telangana State. ...**Plaintiffs**
AND
1] The Tahsildar, M.R.O. Bowenpally, Tadbund, Secunderabad, Telangana State.
2] To All Concerned ....Defendants
Please take notice that the plaintiffs herein have filed a suit for declaring the plaintiffs as legal heirs of Late Smt. N. Manjula who died on 01-11-2017, leaving behind her Plaintiffs No.1,2 and 3 as legal heirs. If anybody is having objections or any claims in the said matter, they should appear before said court on **08-06-2026 at 10.30 AM** failing which the matter will be decided according to the court of law.
///By order of the Hon'ble Court///
M/s. P. Ramesh Advocates & Associates,
Office: Hyderabad, Medchal Malkajgiri District, Telangana State.
Ph. No. 9676307771.

జర్నలిస్టుల సంక్షేమానికి తోడ్పాటు అందిస్తాం..

కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీకి కనుక అద్దాలను అందజేస్తున్న వాసవి ఇంటర్నేషనల్ డిస్టిక్ గవర్నర్ కృష్ణమూర్తి...

కుషాయిగూడ మే 14, ప్రభాతవార్త

జర్నలిస్టులో సంక్షేమానికి తోడ్పాటు నందిస్తామని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ గవర్నర్ సముద్రాల కృష్ణమూర్తి అన్నారు. హెచ్బీ కాలనీ ఉమా ఆప్టికల్స్ అధినేత నేర్లకంటి శ్రీనివాస్ సమకూర్చిన సన్ గ్లాసెస్ చలువ అద్దాలను గురువారము ఆయన ప్రెస్ క్లబ్ కార్యాలయంలో జర్నలిస్టులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలను వెలికి తీయడంలో జర్నలిస్టులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. జర్నలిస్టుల సంక్షేమానికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పూర్తి సహకారం అందజేస్తుందన్నారు. కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ అధ్యక్షుడు వడ్లోజు జ్యోతిర్మయా చారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో , వాసవి క్లబ్ ప్రతినిధులు పెనుగొండ వెంకటేశ్వర్లు లక్ష్మీ సామ్రాజ్యం, కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శ్రీనివాస్, కోశాధికారి సురేష్ ,ఉపాధ్యక్షుడు పలుగుల పవన్, లక్కిడి బాల్రెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి గడ్డమీద బాలరాజు గౌడ్, సెక్రటరీ రోజా రాణి, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

నేరెడ్‌మేట్ , మే 13,ప్రభాతవార్త :

అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఊరటనిస్తోందని మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.వినాయక్‌నగర్, మోలాలి, ఈస్ట్ ఆనంద్‌బాగ్, గౌతమ్‌నగర్ డివిజన్లకు చెందిన పలువురికి రూ.10 వేల నుంచి రూ.60 వేల వరకు ఆర్థిక సహాయం అందజేశారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, మేకల రాము యాదవ్, అమీనుద్దీన్, కేబుల్ రమేష్, ప్రభాకర్ గౌడ్, వైశాలి, నవాబ్, సంతోష్ గుప్తా, రాజశేఖర్ రెడ్డి, మహేష్, బాలకృష్ణ, సాయి సాగర్, ఫరీద్, ఉమేష్, సంపత్ యాదవ్, బంగారు మల్లేష్, ప్రభాకర్ రెడ్డి, సురేష్, ఉస్మాన్, మారుతి ప్రసాద్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో నత్తనడకన రోడ్డు పనులు

గణేష్ దేవాలయం వద్ద నిర్మాణంలో ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం మే14,ప్రభాతవార్త

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ గణేష్ ఆలయం వద్ద కొనసాగుతున్న రోడ్డు అభివృద్ధి పనులను బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్డు నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి, రోడ్డు నిర్మాణం చేపట్టి కొన్ని నెలలు కావస్తున్న ఇప్పటివరకు పట్టించుకునే నాధుడు లేడని ఆయన మండిపడ్డారు,రోడ్డు నిర్మాణం పనులు ఆలస్యం కావడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్న ఆయన, పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రవిశంకర్, సుధీర్ కుమార్, చిన్న యాదవ్, ఉన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు : ఎమ్మెల్యే అహ్మద్ బలాల

అధికారులతో కలిసి కమల్ నగర్ లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల, చిత్రంలో అబ్రార్ తదితరులు

మలక్ పేట, మే 14, ప్రభాతవార్త:

అర్హులైన లబ్ధిదారులు అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించడం జరుగుతుందని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్‌పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, తెలంగాణ హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అశోక్ చక్రవర్తి, అంబర్‌పేట్ తహసీల్దార్ అన్వర్ హుస్సేన్, సైదాబాద్ తహసీల్దార్ మణిపాల్ రెడ్డిలతో కలిసి కమల్‌నగర్, కాలా డేరా, అస్మాన్‌గఢ్ ప్రాంతాల్లోని పాత, శిథిలావస్థకు చేరుకున్న భవనాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పాత ఇళ్ల స్థానంలో కొత్త గృహాల నిర్మాణ ప్రణాళికలను అధికారులు సమీక్షించారు. ప్రస్తుత యజమానులకు ప్రాధాన్యత ఆధారంగా ఇళ్ల కేటాయింపు ఉంటుందని, అదనంగా నిర్మించే గృహాలను ఇతర అర్హులైన లబ్ధిదారులకు కేటాయిస్తామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్రార్, ఆలీం, తదితరులు పాల్గొన్నారు.

వి.హెచ్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఏఎంసి వైస్ చైర్మన్ శ్రీనివాస్



వి.హెచ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఎంసి వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్

సైదాబాద్, మే 14 ప్రభాతవార్త:

బిసి సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వి.హనుమంతరావుకు హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయంలోని ఛాంబర్‌లో వి.హెచ్‌ను కలిసి శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు : మల్కాజిగిరి సీపీ సుమతి

నేరెడ్ మెట్.మే 14,ప్రభాతవార్త : నగర ప్రజలను ధ్వని కాలుష్య బారినుంచి కాపాడేందుకు మల్కాజిగిరి పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. వాహనాలకు అనధికారికంగా మార్పులు చేసిన సైలెన్సర్లతో అధిక శబ్దాలు సృష్టిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని బి. సుమతి స్పష్టం చేశారు. ప్రజా ఆరోగ్యం, రహదారి భద్రత దృష్ట్యా నిబంధనల అమలులో ఎలాంటి రాజీ ఉండదని హెచ్చరించారు.పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు బుధవారం కమిషనరేట్ పరిధిలోని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన వాహనాలపై విస్తృతంగా తనిఖీలు చేపట్టి ఒకే రోజులో 451 కేసులు నమోదు చేశారు. ఉల్లంఘనలకు పాల్పడిన వాహనదారులపై రూ.6.14 లక్షల జరిమానా విధించారు. అదేవిధంగా 76 వాహనాలకు అమర్చిన అనధికారిక సైలెన్సర్లను అక్కడికక్కడే తొలగించారు.ఈ సందర్భంగా సీపీ సుమతి మాట్లాడుతూ, అధిక శబ్దాలు రోగులు, వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. మోటారు వాహన చట్టం ప్రకారం అనుమతించిన సైలెన్సర్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. అనవసర శబ్దాలతో ప్రజా శాంతికి భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు నిరంతరం కొనసాగుతాయని హెచ్చరించారు. వాహనదారులు స్వచ్ఛందంగా తమ వాహనాలకు అమర్చిన అదనపు సైలెన్సర్లను తొలగించుకోవాలని కోరారు.

ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని ఎంఎంసీ కమిషనర్‌కు సాయిజెన్ వినతి

కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న సాయిజన్ శేఖర్

నాచారం, మే 14 ప్రభాతవార్త : హబ్సిగూడ నుంచి నాచారం వెళ్లే ప్రధాన రహదారిపై రాఘవేంద్ర నగర్ వైపు ఉన్న మార్గాన్ని తిరిగి తెరిచి ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కోరారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాయిజెన్ శేఖర్ మాట్లాడుతూ.. రాఘవేంద్ర నగర్, న్యూ రాఘవేంద్ర నగర్, అన్నపూర్ణ కాలనీ, శాంతి గార్డెన్స్, ఇందిరానగర్ ప్రాంతాల ప్రజలతో పాటు రైతుబజార్‌కు వచ్చే ప్రజలు, జాన్సన్ గ్రామర్ స్కూల్, సెయింట్ పీటర్స్ స్కూల్, డెక్కన్ స్ప్రింగ్స్ స్కూల్ విద్యార్థులు గతంలో ఈ మార్గం ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణించేవారని తెలిపారు.అయితే కొంతకాలంగా ఆ రోడ్డును మూసివేయడంతో వాహనదారులు దాదాపు 1.2 కిలోమీటర్లు ఈఎస్ఐ వరకు వెళ్లి యూటర్న్ తీసుకుని రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో చాలామంది వాహనదారులు వాల్యూ మార్ట్ సమీపంలో రాంగ్ సైడ్‌లో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని, ట్రాఫిక్ పోలీసులు భారీగా చలాన్లు విధిస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై స్పందించిన ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి త్వరలోనే ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సాయిజెన్ శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కట్ట బుచ్చన్న గౌడ్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నిందితుడు బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

-మీర్‌పేట్ బిఆర్ఎస్ మహిళాధ్యక్షురాలు సునీత బాలరాజ్

మహిళలతో కలిసి మాట్లాడుతున్న మీర్‌పేట్ బిఆర్ఎస్ మహిళాధ్యక్షురాలు సునీతా బాలరాజ్

సరూర్‌నగర్, మే 14 ప్రభాతవార్త: పోక్సో కేసు నిందితుడైన బండి భగీరథ ఎక్కడ ఉన్నా వెంటనే పోలీసులు అరెస్టు చేయాలని మీర్‌పేట్ బిఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ప్రశాంతిహిల్స్ డివిజన్ బిఆర్ఎస్ నాయకురాలు జమాల్‌పూర్ సునీత బాలరాజ్ డిమాండ్ చేశారు. నందిహిల్స్‌లో గురువారం పలువురు మహిళలు, బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మైనర్ బాలికపై లైంగిక దాడికి సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తనయుడైన భగీరథపై పోక్సో కేసు నమోదై రోజులు గడుస్తున్నా అరెస్టులో జాప్యం జరుగుతున్నదని ఆరోపించారు. సాక్షాత్తు కేంద్ర మంత్రి కుమారుడే మైనర్ బాలికపై దారుణంగా వ్యవహరించడం సభ్య సమాజాన్ని కలవరపరుస్తున్నదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. నిందితుడైన బండి భగీరథ అరెస్టును చేసి బాధిత బాలికకు న్యాయం చేయాలని బిఆర్ఎస్‌తో పాటు మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని ఆమె అన్నారు. ఓ వైపు నిరసనలు, ధర్నాలు జరుగుతుంటే ఆందోళనలు చేస్తున్న వారినే పోలీసులు అడ్డుకోవడం శోచనీయమన్నారు. ఈ కేసులో రాజకీయ ప్రభావం, అధికార దుర్వినియోగం జరుగుతున్నదనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని ఆమె తెలిపారు. నిందితులను కాపాడే ప్రయత్నాలు చేయకుండా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె డిమాండ్ చేశారు. నిందితులు ఎవరైనా చట్టం ముందు సమానమేనని మహిళల భద్రత విషయంలో రాజకీయాలకతీతంగా వ్యవహరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జె.శ్రీనివాస్ నాయక్, మాజీ కార్పొరేటర్లు ఎనుగుల అనిల్ యాదవ్, సిద్దాల పద్మ అంజయ్య, నియోజకవర్గ బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సిల్వేరి సాంబశివ, పార్టీ నాయకులు జగాల్‌రెడ్డి, అబ్బనమోని గోపియాదవ్, సింగం రాజు, మహిళలు సుజాత, రాధ, శ్రీలక్ష్మి, సహస్ర, బుచ్చమ్మ, రాధిక, సుప్రియ, సునీత, మాధవి, సౌజన్య, మణెమ్మ పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ డిగ్రీ కాలేజీలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

కార్యక్రమానికి హాజరైన కాలేజీ పూర్వ విద్యార్థులు తదితరులు

సరూర్‌నగర్, మే 14 ప్రభాతవార్త: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యావారోత్సవాల సందర్భంగా బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల, అధ్యాపకుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని ప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా పూర్వ విద్యార్థులు, కాలేజీకి మధ్య అనుబంధం మరింత బలోపేతం అవుతుందని అన్నారు పూర్వ విద్యార్థుల సూచనలు ఎంతో అవసరమని ఆయన అన్నారు. అంతకు ముందు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమ అనుభవాలు పేర్కొంటూ కాలేజీ విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ నర్సింహరాజ్, అలుమ్ని సభ్యులు పోలె శ్రీకాంత్, మధుకర్, కిరణ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్‌తో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బండి బగీరథ్ వెంటనే అరెస్ట్ చేయాలి : సిపిఎం



బండి సంజయ్ కుమారుడిని అరెస్ట్ చేయాలని సిపిఎం నిరసన

ఉప్పల్, మే 14 ప్రభాతవార్త : కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరద్ వెంటనే అరెస్టు చేయాలి ఉప్పల్ సిపిఎం పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ సిపిఎం పార్టీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపిఎం పార్టీ ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె.వెంకన్న, సర్కిల్ కమిటీ సభ్యులు భీష్మాచారి, శేషు, పద్మ,ఎండి గౌస్ తదితరులు మాట్లాడుతూ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్ వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.వెంటనే నిందితుడిని అరెస్టు చేయాలని, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని మంత్రి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు వెంకటేష్, ఆంజనేయులు, రవీందర్, రవి, రాందాస్, మణికుమార్, ప్రభాకర్, నవీన్ కుమార్, సాయిరాం, అరుణ్ సాయి, ప్రీతం, శివ,శశి, పాష తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమిని కబ్జా నుంచి కాపాడండి : శ్రీనివాస్‌రెడ్డి

ఉప్పల్, మే 14 ప్రభాతవార్త : గల్ఫ్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన 700 ఎకరాల అటవీశాఖ భూమి అక్రమంగా కబ్జా చేసి అందులో భారీ నిర్మాణాలు చేస్తున్నారని బోడుప్పల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర మంత్రి కొండా సురేఖను కలిసి ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన దీనిపై తగు విచారణ చేయాలని కోరారు. మంత్రి కొండా సురేఖతోపాటు, చీఫ్ కన్జర్వేషన్ ఫారెస్ట్ ఆఫీసర్ డాక్టర్ సి.సువర్ణ తదితరులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి : కేతావత్ బహుగుణ

డివిజన్‌లో సమస్యలు చూపిస్తున్న బిఎస్‌పి ఇంఛార్జి కేతావత్ బహుగుణ

సరూర్‌నగర్, మే 14 ప్రభాతవార్త: నాదర్‌గుల్ డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం బహుజన సమాజ్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇంఛార్జి కేతావత్ బహుగుణ స్పష్టం చేశారు. డివిజన్‌కు సంబంధించిన పలు సమస్యల పరిష్కారం కోసం ఇటీవల బిఎస్‌పి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించిన నేపథ్యంలో గురువారం సంబంధిత వర్క్ ఇన్స్‌పెక్టర్ వివిధ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బహుగుణ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులతో కలిసి వివిధ సమస్యలను దృష్టికి తెచ్చారు. తిరుమలనగర్, సాయిహోమ్స్, శ్రీహిల్స్ తదతర కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను వివరించారు. ఈ మేరకు త్వరలో సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయిహోమ్స్ కాలనీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, స్థానిక కాలనీవాసులు, బిఎస్‌పి కారకర్తలు పాల్గొన్నారు.

మహేశ్వరినగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారం : వెంకటేశ్వరరెడ్డి

మహేశ్వరినగర్‌లో డ్రైనేజీ సమస్య పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేత జనంపల్లి వెంకటేశ్వరరెడ్డి తదితరులు

రామంతాపూర్, మే 14 ప్రభాతవార్త : హబ్సిగూడ డివిజన్ మహేశ్వరి నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని కాంగ్రెస్ పార్టీ నేత జనంపల్లి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం కాలనీలో నెలకొన్ని డ్రైనేజీ సమస్యను జలమండలి మేనేజర్ రవీందర్ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ సమస్యలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, దీంతో వెంటనే స్పందించి పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ నేతలు ఎం. అరవింద్ రెడ్డి, కొమ్మిడి మల్లారెడ్డి, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు..దుకాణాలలో సామాగ్రి దగ్ధం



మంటలు ఆర్పుతున్న సిబ్బంది

హయత్ నగర్, మే 14 ప్రభాతవార్త: హయత్ నగర్‌లో జాతీయ రహదారి పక్కన షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి మూడు దుకాణాలకు వ్యాపించాయి. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... గురువారం సాయంత్రం సన్ రైస్ ఆసుపత్రి ఎదురుగా సర్వీస్ రోడ్డులోని జయశ్రీ ఎలక్ట్రానిక్స్, లక్ష్మి నరసింహ కార్ డెకర్స్, ఫర్నిచర్ దుకాణం, మరి కొన్ని దుకాణాలలో ఆకస్మాతుగా మంటలు వచ్చాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్ని మాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి మంటలను ఆర్పి వేసారు. ప్రమాదంలో జయశ్రీ ఎలక్ట్రానిక్స్ షాప్ మరియు ఫర్నిచర్ షాపులలో వస్తువులు కాళిపోయాయి. నష్టం వివరాలు తెలియాల్సి వుంది. జరిగినది. ఎలాంటి ప్రాణనష్టం లేకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలి

తొర్రూర్ లో విద్యార్థులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి తదితరులు

మలక్ పేట, మే 14, ప్రభాతవార్త: విద్యాభ్యాసం కోసం పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని తొర్రూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్మెట్ మండలంలోని తొర్రూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలకు పంపించి నమోదు శాతాన్ని పెంచి నూరు శాతం బడి బయట పిల్లలు లేని గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు. బాల్యం పిల్లల హక్కు అని, ఆ హక్కును హరించే హక్కు ఎవరికీ లేదని బడి వయసు ఉన్న పిల్లలందరూ కూడా బడిలో ఉండాలని, పిల్లలను పత్తి చేనులకు పంపించి వాళ్ళ జీవితాలను నాశనం చేయొద్దని పేర్కొన్నారు. భావి భారత పౌరులను తయారు చేయాలంటే పిల్లలందరిని కూడా ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. తొర్రూరు పాఠశాలలో చదివిన విద్యార్థులకు పదవ తరగతి లో జిల్లా స్థాయి ర్యాంకులు రావడం జరిగిందని, అదేవిధంగా ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్స్ కు తొర్రూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందని వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రమ్య, గ్రామ పెద్దలు విద్యార్థులు పాల్గొన్నారు.

కాలనీ రోడ్ల కనెక్టివిటీ పనులు పూర్తి చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న నవ జీవనరెడ్డి

హయత్ నగర్, మే 14 ప్రభాతవార్త : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా హయత్ నగర్ పరిధిలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులను మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ట్రాఫిక్ మరియు ఆర్ బి అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్వీస్ రోడ్లకు ఆనుకుని ఉన్న కాలనీ లకు ప్రధాన రహదారితో బీటీ కనెక్టివిటీ లేకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కాలనీ వాసుల సౌకర్యార్థం తక్షణమే కనెక్టివిటీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. సర్వీస్ రోడ్లపై ఎక్కడపడితే అక్కడ తోపుడు బండ్లు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడు తోందని వివరించారు. ఆర్టీసీ డిపో సమీపంలో నిర్మాణం లో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను వేగవంతం చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు.కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చీపుర్లు, పరికరాలను అందించాలి

సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

హయత్ నగర్, మే 14 ప్రభాతవార్త : నాగోల్ సర్కిల్ పరిధి 51, 52 డివిజన్ల(పెద్దఅంబర్‌పేట) పరిధిలో పారిశుధ్య కార్మికులకు ఏడు నెలలుగా ఊడ్చడానికి చీపిరి కట్టలు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ కార్మికులు గురువారం విధులు బహిష్కరించి సర్కిల్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సీఐటీయు జిల్లా నాయకులు నర్సింహ మాట్లాడుతూ... గత ఏడు నెలలుగా చీపుర్లు ఇవ్వక పోవడంతో వర్కర్లు సొంత ఖర్చుతో కొనుగోలు చేసి ఉడుస్తున్నారన్నారు. రెండేళ్ల నుండి, సబ్బులు, నూనెలు, డ్రసులు, చెప్పులు, బ్లౌజులు, కొడవండ్లు, పారలు, గంపలు, దంతెలు, గడ్డపారలు, కామకత్తులు, పంజల వంటి పరికరాలు కూడా ఇవ్వడం లేదన్నారు. జవావాండ్లకు పెట్రోల్ సౌకర్యాలు ఇవ్వడం లేదని... పైన తెలిపిన వస్తువులు వెంటనే ఇవ్వాలని.. లేని యెడల సోమవారం నుండి పనులను నిలిపి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో మైసయ్య,నర్సింహ,జంగయ్య,జగన్, మైపాల్,మాదవి, పోచమ్మ, సుజాత, సంతోష పాల్గొన్నారు.

బిసి సంక్షేమ శాఖ సలహదారుడు హనుమంతరావును కలిసిన ఆదమ్ సంతోష్ కుమార్



వి.హనుమంతరావుకు అభినందనలు తెలుపుతున్న ఆదం సంతోష్ కుమార్

నాచారం, మే 14 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ, అభివృద్ధి సలహాదారుగా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి. హనుమంతరావును సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదమ్ సంతోష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సచివాలయంలో జరిగిన ఈ భేటీలో ఆదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. బీసీ వర్గాల అభ్యున్నతికి వి. హనుమంతరావు చేసిన సేవలు విశేషమని, ఆయనకు ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించడం సంతోషకరమని పేర్కొన్నారు. బీసీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆయన సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావుకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కలిసి పనిచేయాలని నాయకులు పరస్పరం చర్చించుకున్నారు.

జయకృష్ణ ఎన్‌క్లేవ్‌లో త్వరలో ఈతకొలను ప్రారంభం

కాలనీవాసులతో కలిసి ఈత కోలనును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వనస్థలిపురం మే14,ప్రభాతవార్త :

హస్తినాపురం డివిజన్ పరిధిలోని జయకృష్ణ ఎంక్లేవ్ నందు నిర్మాణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్ పనులను ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే ఇట్టి స్విమ్మింగ్ పూల్ పనులు తుదిదశకు చేరుకోవడం జరిగిందని అతి త్వరలోనే ప్రారంభం కావడం జరుగుతుందన్నారు. హైదరాబాద్‌లో ఈత కొలనులకు రోజురోజుకు డిమాండ్ పెరుగుతోందన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రైవేట్, ప్రభుత్వ స్థాయిలో స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. పిల్లలు, యువత, మహిళలు ఆరోగ్య పరిరక్షణ కోసం ఈతపై ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు.ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల్లో కూడా స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారని తెలిపారు. ఈత నేర్చుకోవడం వల్ల శారీరక దృఢత్వం పెరగడమే కాకుండా మానసిక ఉల్లాసం కూడా లభిస్తుందని నిపుణులు చెబుతున్నారని అన్నారు.అలాగే నియోజకవర్గ పరిధిలో పార్కులు, ప్లే గ్రౌండ్స్ మరియు ఇతర మౌళిక సదుపాయాల అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని సుధీర్ రెడ్డి పేర్కొన్నారు.ఇట్టి కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు ఆందోజు సత్యంచారి, వనస్థలిపురం డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్,శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జలమండలి ఎండి అశోక్‌రెడ్డితో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి

జలమండలి ఎండి అశోక్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, మే 14 ప్రభాతవార్త : ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం జలమండలి ఎండి అశోక్‌రెడ్డితో బేటి అయ్యారు. ఈ సందర్భంగా కాప్రా, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను జలమండలి ఎండి దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై స్పందించిన వాటర్ వర్క్స్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ పార్టీ నేతలు రహీం,కాలనీ నేతలు రామకృష్ణ రావు, భగీరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డితో ఎంపిఆర్ బేటి

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, మే 14 ప్రభాతవార్త : మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డితో గురువారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి బేటి అయ్యారు. ఉప్పల్ నియోజకవర్గంలో రూ.27 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ఉప్పల్, బీరప్ప గడ్డ, రామంతాపూర్, హబ్సిగూడ, చిలుకానగర్, వెంకట్ రెడ్డి నగర్ డివిజన్లలో రూ. 27 కోట్లతో గ్రేవ్ యార్డ్ పనులు, స్ట్రోమ్ వాటర్ డ్రైన్లు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులకు నిధులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి డి.శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో మౌళిక వసతులు కల్పించి, ప్రజా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షాకాలం లోపు డ్రైనేజీ, రోడ్ల సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎం.డి.రఫీక్, ఉపేందర్ రెడ్డి, కంది శ్రవణ్ రెడ్డి, ఆకారపు అరుణ్ పటేల్, వల్లపు శ్రీకాంత్ యాదవ్, ఆగంరెడ్డి, రాజేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

నేపాలి సర్వెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

-ఉప్పల్ ఏసిపి వెంకట్ రెడ్డి

కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉప్పల్ ఏసిపి వెంకట్ రెడ్డి

కుషాయిగూడ, మే 14, ప్రభాతవార్త

ప్రస్తుత పరిస్థితులలో నేపాలి సర్వెంట్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉప్పల్ అసిస్టెంట్ కమిషనర్ పోలీస్ యాస వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుషాయిగూడ పోలీసులు అన్ని కాలనీల కమ్యూనిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల భద్రతకు సంబంధించి ముఖ్య సూచనలు చేశారు.సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్స్, మేడ్ సర్వెంట్స్ నిర్వహణ,రోడ్డు భద్రత, మహిళల భద్రత,వేసవి సీజన్ దొంగతనాల నివారణపై అవగాహన కల్పించారు, కాలనీల ప్రజలను అప్రమత్తం చేస్తూ శాంతి భద్రతల విషయం లో పోలీసులకు సహకరించాలని కోరారు, ముఖ్యంగా ప్రస్తుతం నగరంలో జరిగిన సంఘటనల దృష్ట్యా నేపాలీ సర్వెంట్ల విషయంలో జాగ్రత్తలు వహించాలని ఎక్కడైనా ఉంటే పోలీసుకు సమాచారం అందించాలని కోరారు,కార్యక్రమంలో సీఐ ఎల్ భాస్కర్ రెడ్డి, డి ఐ వెంకటేశ్వర్లు,వివిధ అంశాల మిధా మట్లాడ డము జరిగింది.ఈ కార్యక్రమం లో ఎస్సైలు సాయిలు,సుధాకర్ రెడ్డి,వెంకన్న,సతీష్, విజయ్, సి డి ఇ డబ్ల్యు సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.